# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 194 | విశాఖపట్నం | 15-4-2026 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 194 | VISAKHAPATNAM | 15-4-2026 WEDNESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM | UPI | yono SBI | BHIM SBI Pay | G Pay | Paytm | Pay




## ఆయుష్ శాఖలో

### అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న

# ధనుంజయుడుపై చర్యలేవి?

- ఆయుష్ శాఖలో ధనుంజయుడు చెప్పిందే వేదం
- విచారణ చేయవలసిన అధికారికే ఫైల్ ఇచ్చిన కమిషనర్
- న్యాయం ఎక్కడుంది? ధర్మం గెలుస్తుందా? గెలవదు
- ఎందుకంటే డీడీ పోస్టులో ఉన్న ధనుంజయుడుని పోస్టులో నుంచి తప్పించి ఎంక్వయిరీ చేస్తే నిజాలు బట్టబయలవుతాయి కదా..
- మంత్రి లోకేష్ ఆదేశాలు జారీచేసినా ఫైల్‌ను తొక్కేసిన అధికారులు?
- ఒకపక్క మందకృష్ణ మాదిగ, టీజేఎఫ్, ఫిర్యాదులను పక్కన పెట్టిన ఆయుష్ అధికారులు
- రోస్టరీ నిబంధనలను తుంగలో తొక్కిన డిడి ధనుంజయుడుపై చర్యలేవి?
- మీడియాపై అవాకులు చవాకులు పేలుతున్న ఆయుష్‌లో ధనుంజయుడు మద్దతుదారులు
- విజిలెన్స్ ఎంక్వైరీ ఆటకెక్కించిన ప్రభుత్వం అది నిజమే కదా..
- గత ప్రభుత్వంలో దొడ్డిదారిన డీడీ ధనుంజయుడుకు అందలం మెక్కించినా అధికారులు..
- డిడి ధనుంజయుడుపై హెల్త్ మినిస్టర్ ఇచ్చిన ఎంక్వైరీ రిపోర్టు ఎక్కడుంది కమిషనర్ గారు..
- బిజెపి పార్టీలో ఉన్నా రాష్ట్ర నాయకుడు చెప్పడంతో ఎంక్వయిరీ ఆపినట్టు తెలిసింది.. అది నిజమే కదా?
- నిజం కాకపోతే ఎందుకు ఎంక్వయిరీ చేయట్లేదు?
- నన్ను ఎవరూ ఏమీ చేయలేరు అంటున్న డిడి ధనుంజయుడు
- చట్టం మీ చేతిలో ఉన్నది అని.. అవినీతికి పాల్పడిన డిడి ధనుంజయడపై చర్యలు తీసుకోరా?

(పతాకం మేజర్ న్యూస్)

వైద్య ఆరోగ్యశాఖలో ఉన్న ఏకైక అవినీతి అధికారిని అందలం ఎక్కిన , దశాబ్దాల కాలం నుంచి ఆయుష్ శాఖలో అవినీతికి, దుర్మార్గానికి, దోపిడీకి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న డిడి ధనుంజయుడు అవినీతి చిట్టా చాలా పెద్దది అని తెలిసిన విషయమే.. ఆయుష్ అయ్యగారు తన గుప్పట్లో పెట్టుకొని కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడి, రోస్టర్ విధానాన్ని పూర్తిగా తుంగలో తొక్కి , వందల సంఖ్యలో ఉద్యోగాలను అమ్ముకొని, ఆయుష్ శాఖలో అవినీతికి ఆజ్యం పోస్తూ, ఆయుష్ శాఖను పూర్తిగా తన గుప్పట్లో పెట్టుకొని ఆయనపై వచ్చిన ఆరోపణలు మరియు ఆయన దగ్గరే ఫైల్ పెట్టుకొని అవన్నీ నొక్కు పెట్టి, ఒక పక్క హెల్త్ సెక్రటరీనీ, మరోపక్క ప్రభుత్వాన్ని, ఆయుష్ డిపార్ట్మెంట్‌ని పూర్తిగా మోసం చేసి దశాబ్దాల కాలం నుంచి కొన్ని కోట్లు వెనకేసుకున్న అవినీతికారే డిడి ధనంజయుడు అని ఆ నోట ఈ నోట అనుకున్నా, ఏమి లేని చందంగా మార్చేసారు అన్నది జగమెరిగిన సత్యం. తన దగ్గర పనిచేస్తున్న సిబ్బంది దగ్గర మీడియాపై అవాకులు చవాకులు పేలుతూ మాపై రాసిన వార్తలు అన్ని విషయాల్లో డీపీఆర్‌వోతో వార్నింగ్ గట్టిగా చెప్పించామని, తోటి అధికారులతో చెప్పుకుంటున్న తీరు చూస్తూ ఉంటే వీళ్ల నాటకాలు కప్పి పుచ్చుకోడానికి ఎంతటికైనా దిగజారుతారు అనటానికి ఇదే నిదర్శనం.

విద్యాశాఖ మంత్రి లోకేష్ డిడి ధనుంజయుడుపై విచారణ చేయమని ఆదేశాలు జారీ చేస్తే దాన్ని పక్కనపెట్టి తప్పించుకొని తిరుగుతున్న డిడి ధనంజయుడుపై విచారణ చేయమని మంత్రి ఆదేశాలు జారీ చేస్తే అదే అధికారికి తాళాలు ఇవ్వటం ఇంతకంటే దారుణమైనా సంఘటన ఎక్కడైనా ఉంటుందా? మంత్రి ఆదేశాలు జారీ చేసినా కొంతమంది అవినీతి అధికారులను కూడగట్టుకొని వదిలేసిన వైనం ఆయుష్ శాఖ అయ్యగారు బాగోతం..

దళిత వర్గాలపై జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరిద్దాము అని సాక్షాత్తు ఎమ్మార్పీఎస్ జాతీయ నేత మందకృష్ణ మాదిగ, మంత్రి లోకేష్‌కు మరియు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి రోస్టర్ విధానాన్ని , మా కులానికి జరిగిన అన్యాయంపై చర్యలు తీసుకోమని చెప్పిన పట్టించుకోలేదు అంటే డిడి ధనుంజయుడు చేసిన అరాచకాలు అన్ని తొక్కేసి బయటికి రానీయకుండా ఆయుష్ శాఖలో జరిగిన అవినీతిని బయటికి పొక్కనీయకుండా అవినీతి అధికారిని అందలం మెక్కించిన ఆయుష్ ఉన్నత అధికారులకే చెల్లింది. ఇటువంటి పరిస్థితిలో ఆయుష్‌శాఖలో ఉన్నత అధికారుల తీరును చూసి ఆయన ఆశ్చర్యపోయారు. ఇదే విషయాన్ని మందకృష్ణ మాదిగ మళ్లీ తలచుకొని స్వయంగా ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్‌కి ఫిర్యాదు చేసిన ఫలితం శ్యూన్యం అని తేటతెల్లమైంది. డిడి ధనుంజయుడు ఎంతమందినైనా మేనేజ్ చేస్తున్నాడని అనడానికి ఇది ఒక ఉదహరణ మాత్రమే అని మందకృష్ణ వాపోయారు.

ఒకపక్క మంత్రి లోకేష్, ఉన్నతాధికారులకి, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కి టీజేఎఫ్ ఫిర్యాదులు చేసిన చర్యలు మాత్రం శూన్యంగానే ఉన్నాయి. డిడి ధనుంజయుడు ఎంతమందిని మేనేజ్ చేస్తున్నాడు అనడానికి ఎన్నో బలమైన కారణాలు విన్పిస్తున్నాయని అనడానికి ఇది నిదర్శనమని పరిగణించవచ్చు.

రోస్టర్ విధానంతో పాటు, ఆయుర్వేద పోస్టులు కూడా అమ్ముకొని మూట కట్టుకున్నారని తోటి అధికారులే స్వయంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదని సాక్షాత్తూ న్యాయస్థానం కోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చింది అంటే ఉన్నతాధికారుల అండదండలు డీడీ ధనుంజయుడుపై ఎంత ఉన్నాయో దీన్ని బట్టి అర్థమవుతుంది. ప్రభుత్వపరంగా అడ్డగోలు నిబంధనలు, శాఖా పరమైన చర్యలు డిడి ధనుంజయుడుపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆ నోట ఈ నోట అన్న కమిషనర్ అండదండలతో రెచ్చిపోతున్నారు అనడానికి హెల్త్ మినిస్టర్ విచారణ చేయమని ఆదేశాలు జారీ చేసిన పట్టించుకోలేదు అంటే కమిషనర్ అండదండలు ఎంత ఎంతవరకు ఉన్నాయో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు .. పాత కమిషనర్ మరియు డిడి ధనుంజయుడు ఇద్దరు ఒక్కటే అని కమిషనర్‌ని మేనేజ్ చేశారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

అయితే కొత్తగా వచ్చిన కమిషనర్ మాత్రం డీడి ధనుంజయుడుపై సీరియస్‌గా ఉన్నారని విచారణకు వచ్చిన అన్ని కూడా మీ ఫిర్యాదులతో పాటు ఇవన్నీ పక్కన పెట్టారని నాకు అర్థమవుతుందని కమిషనర్ తెలిపినట్లు సమాచారం. నా దగ్గర మీ పప్పులు ఉడకవని అవినీతి ఆరోపణలు నిజమైతే కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన చెప్పినట్లు తెలిసింది. ధనుంజయుడుపై ఏ సమయంలోనైనా విచారణ జరుగుతుందని బినామీలు భయపడుతున్నారని తోటి ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

**మరిన్ని విషయాలు మీ పతాకం న్యూస్ రేపటి సంచికలో భయంకరమైన నిజాలు బయట పెట్టబోతున్నాం..**

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## అంబేద్కర్ ఆశించిన కుల నిర్మూలన జరిగిందా?

రాష్ట్రంలో క్రిస్టియన్ల పేరుతో దళితులపై పాలక పార్టీలు దాడి చేస్తున్నాయి. అంబేద్కర్ ఆశించిన కుల నిర్మూలన జరగకపోగా కులాన్ని ఒక రాజకీయ అస్త్రంగా మలచుకొని, కులం నిచ్చెన మెట్లను సింహాసనం ఎక్కే మెట్లుగా మలచుకుంటున్నారు. గత ఐదారు మాసాలుగా రాష్ట్రంలో హిందూ, క్రైస్తవుల మధ్య వైషమ్యాలు, వైరుధ్యాలు పెంచేందుకు పాలక పార్టీల నాయకులు పడుతున్న పాట్లు చూస్తే ఇప్పటివరకు ప్రశాంతంగా ఉన్న ఈ రాష్ట్రంలో మత కల్లోలాలు రెచ్చగొట్టేందుకు వారే కారణమవుతున్నారని అర్థమవుతుంది. ఎన్.డి.ఏ పేరుతో బిజెపితో కలిసి అధికారాన్ని పంచుకోవడమే కాకుండా వారి గాడ్‌ఫాదర్ ఆర్.ఎస్.ఎస్ భావ జాలాన్ని చంద్రబాబు నాయుడు లాంటి వారు నెత్తికెక్కించుకోవడం తాజా రాజకీయాలలో అత్యంత విషాదకరమైన పరిణామం. ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి. పాలక పార్టీలు ఆరోజు అంబేద్కర్ నామస్మరణ చేయటంలో ఒకరికొకరు పోటీలు పడవచ్చు. కానీ ఏ కులం పునాదిపై అంబేద్కర్ దాడి చేశాడో ఆ కులం పునాదులు కాపాడేందుకు నేడు పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయి. మతం పేరుతో దళితుల్ని చీల్చేందుకు కుట్ర పన్నడం అంబేద్కర్ ఆశయాలకు అపచారం చేయడమే. పాలక పార్టీల నాయకులు అంబేద్కర్ మెడలో పూలదండ వేయబోయే ముందు ఒకసారి ఆయన రాసిన 'కుల నిర్మూలన' పుస్తకాన్ని చదవాలని కోరుతున్నాను. అప్పుడైనా ఆయన కోరుతున్నది ఏమిటో, వీరు చేస్తున్నది ఏమిటో బోధపడుతుందేమో. స్వాతంత్ర్యోద్యమంలో అంతర్భాంగా నాడు కుల సమస్య ఎలా పరిష్కరించాలన్న అంశం ముందుకు వచ్చింది. గాంధీ, అంబేద్కర్, కమ్యూనిస్టులు విభిన్న వైఖరులు తీసుకున్నారు. స్వాతంత్ర్యానంతరం భూస్వాములు, పెట్టుబడిదారుల కలయికతో నూతన రాజ్యం ఏర్పడడంతో పాలకవర్గాలు కుల నిర్మూలన అంశానికి ప్రాధాన్యతనివ్వలేదు. పైగా కులాన్ని ఒక రాజకీయ సాధనంగా మార్చేశారు. 1980ల తరువాత వచ్చిన ఆర్థిక సంస్కరణల ప్రభావంతో ఆర్థిక రంగంలోనే కాకుండా సామాజిక, రాజకీయ రంగాల్లో కూడా పెనుమార్పులు వచ్చాయి. కుల అస్తిత్వం ఉన్నంతకాలం కుల నిర్మూలన సాధ్యం కాదని డా॥బి.ఆర్.అంబేద్కర్ కుండ బద్దలుకొట్టినట్లు చెప్పారు. "కుల నిర్మూలన" పేరుతో రాసిన పుస్తకం ఆయన కులంపై ఎంత లోతుగా అధ్యయనం చేశారో అర్థం చేసుకోవడానికి తోడ్పడుతుంది. కుల వ్యవస్థను హిందూ మతం పెంచి పోషిస్తున్నదని, తాను హిందువుగా జన్మించినా, హిందువుగా మాత్రం చనిపోనని జీవిత చరమాంకంలో బౌద్ధాన్ని స్వీకరించారు. మతం కులానికి పునాది కాదని, అది ఈ వ్యవస్థతో పెనవేసుకుపోయిందని దానికి వ్యతిరేకంగా సాగే వర్గ పోరాటంలో అంతర్భాగంగా కుల వివక్షతపై కూడా పోరాడాలని కమ్యూనిస్టులు భావించారు. 21వ శతాబ్దంలో కుల వివక్ష వ్యతిరేక పోరాటాలను కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మరింత ముమ్మరం చేసింది. గాంధీజీ కుల వ్యవస్థ నిర్మూలన కన్నా అస్పృశ్యత, అంటరానితనానికి వ్యతిరేకంగా కేంద్రీకరించి పోరాడారు. భగవద్గీతలో చెప్పినట్లు కులాలను దేవుడే సృష్టించినా అసమానతలను మానవుడు సృష్టించాడని ఆయన నమ్మాడు. ఎవరి దారిలో వారు కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారు. 1980ల తర్వాత ఆర్థిక సంస్కరణల ప్రభావంతో రాజకీయాలు కూడా వ్యాపారమయమైపోయాయి. ఓటు ఒక సరుకుగా మారింది. కులాలు, మతాలవారీగా ఓటు బ్యాంకులుగా ప్రజలను పాలకవర్గాలు విభజించాయి. దాదాపు మూడు దశాబ్దాల పాటు విరాజిల్లిన అస్థిత్వ రాజకీయాలు క్రమంగా పాలకవర్గాల రాజకీయాల్లో అంతర్భాగం అయ్యాయి. హిందూత్వ పేరుతో సాగుతున్న బిజెపి, ఆర్.ఎస్.ఎస్ ల అస్థిత్వ రాజకీయాలు కుల నిర్మూలన కోసం సాగే ప్రజాస్వామిక ఉద్యమాలను బలహీనపర్చాయి. తాజా సుప్రీం కోర్టు తీర్పును దళిత క్రిస్టియన్లను ఇతర తరగతుల నుండి వేరు చేసేందుకు వారు ఉపయోగించుకుంటున్నారు. ఇటీవల ఆకివీడు పెదపేటలో జరిగిన దేవాలయ వివాదాన్ని సైతం దీనికి ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ స్థితిలో కుల నిర్మూలనకోసం సాగే ఉద్యమాలను బలపర్చుకోవడానికి కులవివక్ష, సామాజిక అసమానతలపై ప్రజాస్వామిక స్ఫూర్తితో విశాల ఉద్యమాలను నిర్మించాల్సిన ఆవశ్యకత ముందుకొచ్చింది. చీలికలు, పీలికలైన వివిధ సామాజిక ఉద్యమాలు -- సంస్థలను పాలకవర్గ రాజకీయ ప్రభావాల నుండి వేరుచేసి ప్రజలలోని ఇతర అణగారిన తరగతులతో మమేకం చేయడం నేటి తక్షణ ఆవశ్యకత. ఈ నేపథ్యంలో మతం పేరుతో దళితులను, ఆదివాసీలను, ఇతర అణగారిన తరగతులను చీల్చేందుకు సంఘపరివారం చేస్తున్న కుట్రలను సమైక్యంగా తిప్పికొట్టాలి. క్రైస్తవంలోకి మారిన దళితులు ఎస్సీలు కారని జరుగుతున్న ప్రచారంలో హేతుబద్ధత లేదు. కులం హిందూ మతంలోనే ఉందని, క్రిస్టియానిటీలో లేదని అందువల్ల క్రైస్తవంలోకి మారిన దళితులు ఎస్సీలు కారని వీరు వాదిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు ఆకివీడు ఘటనలో వాస్తవాలను మరుగుపర్చి పెదపేట దేవాలయ వివాదాన్ని హిందూ క్రిస్టియన్ల వివాదంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. హిందూ మతంలోనే కుల వివక్షత ఉందని, క్రిస్టియానిటీలో ఉండదని ఆయన సెలవిచ్చారు. క్రిస్టియన్లుగా మారిన దళితులు కులాన్ని కోల్పోతారని వీరి వాదన. ఇదే నిజమైతే కుల వివక్షత లేని క్రిస్టియన్ మతాన్నే అభ్యుదయ మతంగా చూడాల్సి ఉంటుంది. హిందూ మతంలోనే కులవివక్షత ఉందంటున్న రఘురామకృష్ణరాజు లాంటి వారు ఎస్సీలను ఒంటరి చేయడానికి ఈ వాదన తెస్తున్నారు. ఉన్నత పదవిలో ఉన్న వీరు హిందూ మతంలో ఉన్న కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడడానికి ఏమాత్రం ముందుకు రావడం లేదు. పైగా దానిని సమర్థిస్తున్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవులు అలంకరించిన వారు పరోక్షంగానైనా కుల వివక్షతను సమర్థించడం నేరం అవుతుంది. అగ్రకుల ఆధిపత్యాన్ని వారు ఈ రూపంలో ప్రదర్శిస్తున్నారు. హిందూత్వ పేరుతో సాగే ప్రచారం అంతిమంగా అగ్రకుల ఆధిపత్యానికే దారితీస్తుందన్న నిజం వీరి మాటలతో రుజువైంది. క్రైస్తవంలోకి మారిన దళితులు తిరిగి హిందూ మతం స్వీకరిస్తేనే వారు ఎస్సీలు అవుతారని సుప్రీంకోర్టు సైతం చెప్పటం రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా లేదు. వారు తిరిగి వెనక్కి వస్తే ఎస్సీలుగా కుల వ్యవస్థలో ఉండే అంటరానితనాన్ని, వివక్షతను అనుభవించమని చెప్పటమే.

## బీహార్ సీఎం పదవికి నితీశ్ కుమార్ రాజీనామా




**బీహార్:** జేడీయూ అధినేత నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా తన పదవికి రాజీనామా చేశారు. ఈరోజు లోక్‌భవన్ చేరుకున్న ఆయన తన రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు అందజేశారు. నితీశ్ కుమార్ స్థానంలో ముఖ్యమంత్రిగా ఎవరు వస్తారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజీనామాను సమర్పించడానికి ముందు ఆయన మంత్రివర్గ సమావేశాన్ని చివరిసారిగా ఏర్పాటు చేశారు. మంత్రివర్గాన్ని రద్దు చేస్తున్న విషయాన్ని కేబినెట్‌కు తెలియజేశారు. నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా రెండు దశాబ్దాలు కొనసాగారు. ఇటీవల ఆయన రాజ్యసభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. దీనితో ఆయన ఈరోజు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ముఖ్యమంత్రిగా పలువురు బీజేపీ నాయకుల పేర్లు వినిపిస్తున్నాయి. బీజేపీ నాయకుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో తొలిసారి ఆ పార్టీ ఈ పదవిని చేపట్టినట్లవుతుంది. అయితే ఇప్పటి వరకు ఉపముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరి ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కేంద్ర సహాయమంత్రి నిత్యానందరాయ్ పేరు కూడా ఈ జాబితాలో ఉంది.

## ఇకపై పోలీసులకు కూడా ప్రత్యేక సెలవులు ..!



**అమరావతి, పతాకం న్యూస్:** పండగలకు, పబ్బాలకు కుటుంబాలతో గడపలేక తీవ్ర ఒత్తిడితో పనిచేసే పోలీసు సిబ్బందికి ఊరటనిచ్చేలా ఎపి డిజిపి కార్యాలయం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పుట్టినరోజు, పెళ్లి వేడుకలు వంటి ప్రత్యేక సెలవులను మంజూరు చేయాలని డిజిపి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు అన్ని ర్యాంకుల వారికి ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేస్తూ .... రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా అన్ని జిల్లాల ఎస్పీలకు, పోలీస్ విభాగాల అధిపతులకు ఆదేశాలు పంపారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే తప్ప, సిబ్బంది కోరిన వెంటనే ఈ ప్రత్యేక సెలవును మంజూరు చేయాలని ఆయన స్పష్టంగా సూచించారు. ఈ విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని, సెలవు మంజూరు చేయడం తప్పనిసరి అని ఆదేశాల్లో పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు తమ కుటుంబ సభ్యులతో గడిపే సమయం చాలా తక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో వారి జీవితంలో ముఖ్యమైన ఈ రెండు రోజుల్లోనైనా కుటుంబంతో సంతోషంగా గడిపేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రత్యేక సెలవుల ద్వారా సిబ్బంది మానసికంగా ఉల్లాసం పొంది, విధుల్లో మరింత ఉత్సాహంగా పాల్గొంటారని ఉన్నతాధికారులు ఆశిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా .... మరోవైపు పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ ప్రతిపాదనలకు సంబంధించి ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఇప్పటివరకు కొనసాగుతున్న ఫిజికల్ (మాన్యువల్) పద్ధతిలో పెన్షన్ ప్రతిపాదనలను సమర్పించేందుకు ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే అవకాశం కల్పించారు. మే 1వ తేదీ నుంచి రిటైర్డ్ ఉద్యోగులు తప్పనిసరిగా 'నిధి' పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే తమ దరఖాస్తులను సమర్పించాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూశ్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వండి: ఏపీలోని అన్ని పార్టీలకు చంద్రబాబు లేఖ



**అమరావతి, పతాకం న్యూస్:** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 'నారీ శక్తి వందన్ అధినియం'పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ముందడుగు వేశారు. ఈ చారిత్రక బిల్లుకు సంపూర్ణ మద్దతు కూడగట్టే లక్ష్యంతో ఆయన రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులకు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు మంగళవారం లేఖ రాశారు. రాబోయే 2029 ఎన్నికల నుంచే ఈ రిజర్వేషన్లు అమల్లోకి తీసుకురావాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షను అందరూ కలిసికట్టుగా బలపరచాలని తన లేఖలో చంద్రబాబు గట్టిగా విజ్ఞప్తి చేశారు. ఈ నెల 16న పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లును ప్రవేశపెట్టడం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచిపోతుందని చంద్రబాబు తన లేఖలో అభిప్రాయపడ్డారు. "మహిళా రిజర్వేషన్ బిల్లుపై విస్తృతంగా చర్చలు జరిగాయి. త్వరితగతిన ఈ చారిత్రక చట్టం అమల్లోకి రావాలన్న ఏకాభిప్రాయం కూడా నాడు వ్యక్తమైంది. ఇందులో భాగంగా 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్లు అమలు కావాలన్న ప్రధాని నరేంద్ర మోదీ గారి ఆకాంక్షకు మనందరం మద్దతు పలుకుదాం" అని ఆయన కోరారు. ఈ అంశం రాజకీయాలకు అతీతమైనదని, దేశ గౌరవానికి సంబంధించిన విషయమని చంద్రబాబు స్పష్టం చేశారు. "మహిళా రిజర్వేషన్ పై అంతా ఒకే స్వరం వినిపించాలని ఆడబిడ్డల తరుపున బాధ్యతతో ఈ లేఖ రాస్తున్నాను. మన ఇంటి ఆడబిడ్డలను, మన దేశ మహిళలను గౌరవించుకునే ఈ అవకాశాన్ని మనందరం అదృష్టంగా భావిద్దాం. ఈ పవిత్ర ఘట్టంలో భాగస్వామి అయ్యే సందర్భాన్ని ఎవరూ వదులుకోవద్దు" అని ఆయన హితవు పలికారు.

## దేశంలోనే తొలి క్వాంటం ఫెసిలిటీ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు




**అమరావతి, పతాకం న్యూస్:** క్వాంటం టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త చరిత్ర సృష్టించింది. దేశంలోనే తొలిసారిగా క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీని ఏర్పాటు చేసిన రాష్ట్రంగా ఏపీ ఘనత సాధించింది. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సదుపాయాలను మంగళవారం ప్రారంభించారు. ఈ ఆవిష్కరణతో క్వాంటం రంగంలో రాష్ట్రం కీలక ముందడుగు వేసినట్లయింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన '1ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీ'తో పాటు, గన్నవరంలోని మేధా టవర్స్‌లో ఉన్న '1క్యూ క్వాంటం ఫెసిలిటీ'ని సీఎం ప్రారంభించారు. ఈ రెండు కేంద్రాలు క్వాంటం కంప్యూటింగ్ ఉపకరణాలను పరీక్షించే టెస్ట్ బెడ్స్‌గా పనిచేస్తాయి. మైనస్ 273 డిగ్రీల సెల్సియస్ అత్యంత శీతల ఉష్ణోగ్రత వద్ద పనిచేసేలా వీటిని రూపొందించారు. ఈ కొత్త సదుపాయాలతో అమరావతి క్వాంటం వ్యాలీకి ఇప్పుడు క్వాంటం కంప్యూటర్ హార్డ్‌వేర్‌ను పరీక్షించి, సర్టిఫై చేసే సామర్థ్యం లభించింది. క్వాంటం కంప్యూటర్ పరికరాలు తయారుచేసే కంపెనీలకు, పరిశోధకులకు, విద్యార్థులకు, నిపుణులకు ఈ టెస్ట్ బెడ్స్ ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్, డీఎస్టీ ప్రతినిధులు, వివిధ క్వాంటం కంపెనీల అధిపతులు, ఐఐటీ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు హాజరయ్యారు.

## దివ్యాంగ విద్యార్థుల ఎవరెస్ట్ సాహసయాత్రను ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్



**అమరావతి, పతాకం న్యూస్:** కసి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని, ఎదురయ్యే సవాళ్లను అధిగమించి ప్రపంచాన్ని జయించాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో దేశ చరిత్రలోనే ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రత్యేక అవసరాలు గల 21 మంది దివ్యాంగ విద్యార్థుల బృందం చేపట్టనున్న నేపాల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణ యాత్రను మంత్రి లోకేశ్ మంగళవారం ఉండవల్లిలోని తన నివాసంలో జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులతో ఇలాంటి సాహసయాత్ర నిర్వహించడం దేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ నెల ఏప్రిల్ 15 నుంచి 30వ తేదీ వరకు 16 రోజుల పాటు ఈ సాహసయాత్ర కొనసాగనుంది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న 21 మంది విద్యార్థులు (8 మంది బాలికలతో సహా) ఈ బృందంలో ఉన్నారు. వీరంతా సముద్ర మట్టానికి 5,364 మీటర్ల ఎత్తులో ఉన్న ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను అధిరోహించనున్నారు. ఏప్రిల్ 15న మధ్యాహ్నం ఈ బృందం నేపాల్ రాజధాని ఖాట్మండూకు చేరుకొని, అక్కడి నుంచి తమ యాత్రను ప్రారంభిస్తుంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై ముఖాముఖి నిర్వహించారు. వారిలో స్ఫూర్తి నింపుతూ, "ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులుగా మీరు ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు వెళ్లడం చాలా ఆసక్తిగా, గర్వంగా ఉంది. సాధారణ వ్యక్తులలో లేని కృషి, పట్టుదల మీలో ఉన్నాయి. జీవితంలో మీరు ఎన్నో అవమానాలు, మాటలు ఎదుర్కొని ఉంటారు. వాటన్నింటినీ అధిగమించి ఈ స్థాయికి రావడం అభినందనీయం. మనలో ఉన్న కసి, పట్టుదలే మనల్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి" అని అన్నారు. "మీలాంటి వారిని ప్రోత్సహిస్తే సమాజంలో కూడా గొప్ప మార్పు వస్తుంది. ఈ కార్యక్రమాన్ని నేను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తాను. మా కుటుంబంలో కూడా ఒకరు మాట తడబాటుతో ఇబ్బంది పడ్డారు. ఎంతోమంది ఎగతాళి చేశారు. దేవుడు ప్రతి కుటుంబానికి ఒక పరీక్ష పెడతాడు, దానిని జయించే శక్తిని కూడా ఇస్తాడు. ఆ శక్తి మీ అందరిలో ఉంది. ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. సవాళ్లను అధిగమించి ప్రపంచాన్ని జయించండి. సమాజం మిమ్మల్ని గౌరవించేలా, సొంత పిల్లల్లా చూసుకునేలా మీరు ఎదగాలి" అని లోకేశ్ పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఇలాంటి ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## రాజ్యాంగాన్ని బీజేపీ, ఆరెస్సెస్ ఆలోచనలు ధ్వంసం చేస్తున్నాయి: రాహుల్‌గాంధీ



**కోల్‌కతా, పతాకం న్యూస్:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడుతున్న తరుణంలో రాజకీయాలు వేడెక్కాయి. అధికార, విపక్షాలు ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, బీజేపీ ఆరెస్సెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విద్వేషంతో నిండిన బీజేపీ, ఆరెస్సెస్ ఆలోచనలు రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నాయని ఆరోపించారు. కాషాయ పార్టీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని విమర్శించారు. బంగాల్‌లోని ఉత్తర్‌దినౌజ్‌పూర్ జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ గాంధీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "బంగాల్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ పోరులో బీజేపీ పార్టీ ఉంది. వారిది విద్వేషపూరిత భావజాలం, హింసను ప్రేరేపిస్తారు. వారి ప్రధానమంత్రి కూడా ఒక రాజీ పడిన వ్యక్తి, అలాంటి వారి గురించి మాట్లాడాల్సిన అవసరమే లేదు. అదేవిధంగా, బంగాల్‌లో టీఎంసీ పార్టీ కూడా ఉంది. ఈ టీఎంసీ పార్టీయే బీజేపీకి దారి చూపిస్తోంది. ఒకవేళ టీఎంసీ తన బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించి ఉంటే, మీకు సరైన ఉపాధిని కల్పించి ఉంటే, ద్వేషాన్ని వ్యాప్తి చేయకుండా ఉండి ఉంటే, అప్పుడు ఇక్కడ బీజేపీకి చోటే ఉండేది కాదు. అసలు బంగాల్‌లో బీజేపీ ఎక్కడా కనిపించేది కూడా కాదు." అని రాహుల్‌గాంధీ తెలిపారు. మరోవైపు, బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోందని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. బంగాల్‌లో బీజేపీ ఓటు చోరీ చేసేందుకు సీఎం మమతాబెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వమే అవకాశం ఇచ్చిందని దుయ్యబట్టారు.

## సహకార బ్యాంకుల బలోపేతమే లక్ష్యం



**అరసవల్లి, పతాకం న్యూస్:** సహకార రంగాన్ని బలోపేతం చేసి, బ్యాంకులను ప్రజలకు చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆలిండియా కోపరేటివ్ బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ కేవీఎస్ రవి కుమార్ తెలిపారు. డీసీసీబీ 61వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నుంచి బైక్ ర్యాలీని ప్రా రంభించామన్నారు. 16 మంది ఉద్యోగులు ఈనె ల 13 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా 1300 కిలోమీటర్లు ప్రయాణించి, ప్రజలకు, రైతులకు సహకార బ్యాంకుల ప్రాముఖ్యతను వివరిస్తార న్నారు. దేశంలోనే పంచాయతీరాజ్ వ్యవస్థ తరు వాత సహకార రంగం రెండవ అతి పెద్ద వ్యవస్థ అని, ఇది పూర్తిగా నిర్వీర్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డీసీసీబీ ఛైర్మన్ శివాల సూర్య నారాయణ మాట్లాడుతూ.. డీసీసీబీ బలో పేతానికి రెండంచెల విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అందరూ సమష్టిగా పనిచేసి ఈ రంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. ఉద్యో గులకు బీమా సదుపాయం కల్పించిన రెండో జిల్లా శ్రీకా కుళం అని అన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల కోఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ శ్రీనివా సులు, ఎస్వీ ఎస్ జగదీష్, మురళి, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం నుంచి తిరుపతికి రెగ్యులర్ రైలు ప్రారంభం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీకాకుళం జిల్లా ప్రజల 75 ఏళ్ల చిరకాల స్వప్నం నెరవేరింది. జిల్లా చరిత్రలో తొలిసారిగా తిరుపతికి నేరుగా వెళ్లే రెగ్యులర్ రైలు సేవలు ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం రోడ్ – తిరుపతి హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను (17439/40) కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయాన్ని, తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రక్షేత్రంతో ఈ రైలు అనుసంధానం చేస్తుందని తెలిపారు. దీనివల్ల వేలాది మంది భక్తులకు ప్రయాణం మరింత సులభతరం అవుతుందన్నారు. ప్రయాణికులతో మాట్లాడినప్పుడు వారిలో కనిపించిన ఆనందం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ఈ రైలు సేవ కేవలం ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, ప్రాంతీయ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని వివరించారు. ఈ కొత్త రైలు సేవను సాకారం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలోని ఎన్‌డీఏ డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. ఇది కేవలం ఒక రైలు మాత్రమే కాదని, శ్రీకాకుళం ప్రజల ఆశలు, ఆకాంక్షలను అభివృద్ధికి అనుసంధానించే కీలక ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాల్తేర్ డీఆర్ఎం లలిత్ బోహ్రా, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ నివాళులర్పించిన ప్రధాని, రాష్ట్రపతి



**అహ్మదాబాద్, పతాకం న్యూస్:** అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రధాని మోడీ, రాష్ట్రపతి ముర్ములు ఆయనకు నివాళులర్పించారు. మంగళవారం అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ముర్ము గుజరాత్ పర్యటన సందర్భంగా లోక్‌భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌జీ కూడా అంబేద్కర్‌కు నివాళులర్పించారు. అలాగే పార్లమెంటు ప్రాంగణంలోని ప్రేరణాస్థల్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ప్రధాని మోడీ, ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు. కాగా, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు. దేశ నిర్మాణానికి ఆయన చేసిన కృషి ఎంతో స్ఫూర్తిదాయకం. ఆయన జీవితం, కృషి, ఒక న్యాయమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించడానికి తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి అని మోడీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. భారత రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి, గొప్ప సంఘ సంస్కర్త అయిన అంబేద్కర్ జయంతి సందర్భంగా నేను నివాళి అర్పిస్తున్నాను. అంబేద్కర్ న్యాయ శాస్త్రవేత్త, ఆర్థికవేత్త, ప్రగాఢ ఆలోచనాపరుడు, న్యాయ పండితుడు, సమానత్వ సామాజిక వ్యవస్థకు బలమైన సమర్థకుడిగా ముర్ము ఆయనను అభివర్ణించారు. అంబేద్కర్ తన జీవితాన్ని సమాజంలోని అణగారిన, బలహీన వర్గాల అభ్యున్నతికి అంకితం చేసి, వారి పక్షాన చారిత్రాత్మకమైన కృషి చేశారు. ఆయన అసమానతలను తొలగించే మార్గాన్ని చూపడమే కాకుండా, భారతదేశ ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ హక్కులను బలోపేతం చేయడంలో కూడా కీలక పాత్ర పోషించారు. అంబేద్కర్ మహిళల విద్యకు, వారి హక్కులకు ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన చేసిన బహుముఖ సేవలు, దేశ సేవ మరియు అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించడానికి భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. ఈ సందర్భంగా మనం జీవితాలలో బాబాసాహెబ్ అంబేద్కర్ ఆదర్శాలను అలవర్చుకుని, న్యాయమైన, సమ్మిళితమైన, ప్రగతిశీల దేశ నిర్మాణానికి దోహదపడతామని ప్రతిజ్ఞ చేద్దాం అని ముర్ము ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

# రోడ్డు పనులు పూర్తి చేయాలని గిరిజనుల నిరసన



**ఎస్.కోట, పతాకం న్యూస్:** శృంగవరపుకోట పంచాయతీ పరిధిలోని గిరిశిఖర గ్రామం రేగపుణ్యగిరికి రోడ్డు పనులు పూర్తిచేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులు ఎంపిడిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తొలుత వంటావార్పు కార్యక్రమానికి సిద్ధమవగా, అనుమతులు తీసుకోలేదని పోలీసులు అంగీకరించలేదు. దీంతో గిరిజనులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు మాట్లాడుతూ ఆదివాసీల నివాస ప్రాంతానికి సుమారు రూ.4.50 కోట్లతో తారురోడ్డు మంజూరైనా, నిర్మాణ పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్ జాప్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రోడ్డు నిర్మాణానికి ఆటంకాలను తొలగించి, ఆగిన రోడ్డు పనులు వేగవంతం చేయాలని పలు దఫాలుగా కలెక్టర్, ఎంపిడిఒలకు వినతులు అందజేసి, నిరసనలు చేపట్టామని తెలిపారు. గత వారం ధర్నా చేపడితే జిల్లా, మండల అధికారులు స్పందించి వారం రోజులు సమయం అడిగారని, శనివారం నుంచి పని ప్రారంభిస్తామని హామీ ఇచ్చి విస్మరించారని తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించాలని, లేకుంటే ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు నిరసన వద్దకు వచ్చారు. బుధవారం నుంచి పనులు ప్రారంభిస్తామని, భారీ వాహనాలను తెప్పించి తొందరగా పని అయ్యేటట్టు చూస్తామని హామీనిచ్చారు. దీంతో ఆదివాసీలంతా నిరసన కార్యక్రమాన్ని విరమించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లా జగన్‌తోపాటు సన్యాసిరావు, సాంబయ్య, నాగేశ్వరరావు, కృష్ణ, రమేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే ఉజ్వల భవిష్యత్



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** విద్యార్థుల మనస్తత్వం ఆధారంగా విద్యనందించే ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నారని, అక్కడే వారికి ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ఎమ్మెల్యే, పీయూసీ రాష్ట్ర ఛైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఎంఈవోలు ఎం.వాగ్దేవి, పి.రాజారావు ఆధ్వర్యంలో పొందూరు పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. విద్యార్థు లకు సరళమైన విద్యావిధానంలో బోధన అందించే సామర్థ్యం ప్రభుత్వ ఉపాధ్యాయు లకే సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లల ను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. అనంతరం గ్రామంలోని ఇళ్లకు ఆయన వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తామని వారి తల్లిదండ్రుల నుంచి అనుమతిపత్రాలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎం పీడీవో వాసుదేవరావు, డిప్యూటీ ఎంపీడీ వోలు అప్పన్న, సింహాచలం, ఈవో జగదీష్ టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మో హన్, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర భాస్కర్, ఎంపీటీసీ బాడాన గిరి, మండల మహిళా అధ్యక్షురాలు ఎ.విజయలక్ష్మి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సర్వశిక్షా అభియాన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగు లుగా 14 ఏళ్లుగా పని చేస్తు న్నా ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, తగు చర్యలు తీసుకుని ఆదుకోవాలని ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే, పీ యూసీ ఛైర్మన్ కూన రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఐదేళ్లుగా ఒక్క రూపాయి వేతనం పెరగలేదని, వస్తున్న చాలీ చాలని జీతాలతోనే కుటుంబాలను పోషించు కునేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆయ న దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో ఎంఐఎస్ కో–ఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్, సీఆర్ఎంటీలు, పీటీఐలు ఉన్నారు.

## పార్టీలకతీతంగా సీఎంఆర్ఎఫ్



**గుమ్మలక్ష్మీపురం, పతాకం న్యూస్:** పార్టీలకతీతంగా అర్హతే ప్రాతిపదికన ముఖ్యమంత్రి సహాయనిధిని అందజేస్తున్నామని ప్రభుత్వ విప్ జగదీశ్వరి అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులకు లబ్ధిదారులకు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ వైద్యపరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కురపాం మండలం బియ్యాలవలసకు చెందిన పాలక సుందరరావుకు రూ.30,786, కిచ్చాడ గ్రామానికి చెందిన పద్మనాథం సుస్మితకు రూ.23,400, కురుపాం గ్రామానికి చెందిన కర్రి సత్యంనాయుడుకు రూ.52,522 చెక్కులను ఆమె అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కె.వి.కొండయ్య, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కోలా రంజిత్‌కుమార్, కురపాం పీఏసీఎస్ ఛైర్మన్ డొల్లు కిశోర్, రామకృష్ణ, శ్రీను, సుబ్బలక్ష్మి, రంగారావు, మాసయ్య పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయాలని రజకుల ధర్నా

**విజయనగరం, పతాకం న్యూస్:** రజకులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను, జీవోలను వెంటనే అమలు చేయాలని రజక సంఘాల ఐక్యవేదిక, జిల్లా రజక సమాఖ్య అధ్యక్షులు గురజాపు సత్యారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద ఆయా సంఘాల ఆధ్వర్యాన పెద్దఎత్తున ధర్నా చేశారు. అంతకుముందు గ్రీవెన్సులో అధికారులకు వినతి అందజేశారు. అనంతరం ధర్నాలో నాయకులు మాట్లాడుతూ దేశంలో 17 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చారన్నారు గతంలో కూడా ఆంధ్రప్రదేశ్ శాసనసభలో తీర్మానం చేశారని, బిసి డిక్లరేషన్ హామీలను అమలు చేయాలన్నారు. జీవో నెంబర్ 6 ప్రకారం జిల్లా రజక సంక్షేమ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు చాకిరేవు స్థలాలపై చట్టబద్ధమైన హక్కులను కల్పించాలన్నారు. రజకులకు సామాజిక భద్రత చట్టాన్ని రూపొందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయకార్యదర్శి తామాడ అచ్చన్న, రజక సంఘ ఐక్యవేదిక కో కన్వీనర్ ఎం.అప్పలరాజు, రజకులు పాల్గొన్నారు.

## గంగాసాగరం రిజర్వాయర్ అభివృద్ధికి చర్యలు



**కంచిలి, పతాకం న్యూస్:** జలంత్రకోట పంచాయతీ పరిధి గంగాసాగరం రిజర్వాయర్‌ను పలాస ఆర్డీవో అప్పలరాజు పరిశీలించారు. రిజర్వాయర్‌లోకి వరద నీరు వచ్చే అవకాశాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ దిగువన ఉన్న ఆయకట్టు వివరాలు సేక రించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జలధార మిషన్‌లో భాగంగా రిజర్వాయర్ అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, ఎంపీడీవో వి.తిరుమలరావు, ఇరిగేషన్ జేఈ రమణమూర్తి పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



**పార్వతీపురం, పతాకం న్యూస్:** గిరిజన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఐటీడీఏ గిరిమిత్ర హాల్‌లో యాక్షన్‌ప్లాన్ రూపకల్పనపై జిల్లా స్థాయి అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులతో చర్చించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్య, వైద్య రంగాల అంశాలపై ఆరా తీశారు. గిరిజన గ్రామాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులను గుర్తించాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతే ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారి సౌకర్యం, రక్షిత నీటి సరఫరా, విద్యుత్, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టులు, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య కేంద్రాల పటిష్ఠతపై దృష్టి సారించాలని గిరిజన సంఘాల నేతలు కోరారు.

## ఇంట్లో తల్లి నిద్రిస్తుండగా నిప్పుపెట్టిన కుమారుడు.. తల్లి మృతి




**ప్రకాశం, పతాకం న్యూస్:** వెంకట రమణమ్మకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు కిషోర్ బాబు తనతో పాటు గద్దలగుంటలో ఉంటూ మాంసం దుకాణం నిర్వహిస్తున్నాడు. చిన్న కుమారుడు చెన్నైలో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం ఉదయం తల్లి నిద్రిస్తున్న సమయంలో పెద్ద కుమారుడు ఇంటికి నిప్పుపెట్టాడు. మంటలు చెలరేగడం చూసిన ఇరుగుపొరుగు వారు ఇంటి దగ్గరకు చేరుకున్నారు. ఇంటి బయట ఉన్న కిషోర్ బాబును ఏం జరిగిందంటూ నిలదీశారు. వారు అడిగిన ప్రశ్నలకు నిందితుడు సరైన సమాధానాలు చెప్పలేదు. చుట్టుపక్కన ఉన్న వారి ప్రశ్నల ఒత్తిడి తట్టుకోలేక అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించినా కుదరలేదు. దీంతో వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక అధికారులు వాహనాలను తీసుకొని ఘటనా స్థలానికి చేరుకున్నారు. పైపుల సహాయంతో ఎగిసిపడుతున్న మంటలను నీళ్లు కొట్టి అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో వెంకట రమణమ్మ మంటల్లో కాలి బూడిదయ్యింది. అక్కడికి చేరుకున్న పోలీసులు స్థానికుల నుంచి ప్రాథమిక సమాచారాన్ని అడిగి తెలుసుకొని ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో రమణమ్మ పెద్ద కొడుకు కిషోర్ బాబుకు మతిస్థిమితం సరిగా ఉండదనే విషయం బయటకు వచ్చింది. హత్యకు ఇది కూడా ఒక కారణమే అయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. హత్యకు గల అసలైన కారణాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కిషోర్ బాబు పారిపోవడంతో అతన్ని పట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

## ఏపీ పెన్షనర్లకు అలర్ట్.. ఇకపై 'నిధి' పోర్టల్ ద్వారానే పెన్షన్ ప్రాసెసింగ్.. కీలక ఉత్తర్వులు జారీ!



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్ల మంజూరు ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు, జాప్యాన్ని తగ్గించేందుకు మరో కీలక అడుగు వేసింది. ఇకపై రాష్ట్రంలోని అన్ని రకాల పెన్షన్ కేసులను నిధి పోర్టల్ ద్వారా మాత్రమే ప్రాసెస్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిజికల్ అప్లికేషన్లకు స్వస్తి చెప్పి, మే 1 నుంచి ఈ కొత్త రూల్ అమలు చేయబోతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కాగితపు దరఖాస్తుల విధానానికి ప్రభుత్వం గడువు విధించింది. ఏప్రిల్ 30, 2026 వరకు అందిన ఫిజికల్ పెన్షన్ ప్రపోజల్స్‌ను మాత్రమే అధికారులు అంగీకరిస్తారు. మే 1, 2026 నుంచి ఎటువంటి పేపర్ అప్లికేషన్లను స్వీకరించబోమని ప్రభుత్వం చెప్పింది. ఆ తేదీ తర్వాత వచ్చే పెన్షన్ దరఖాస్తులన్నీ తప్పనిసరిగా నిధి పోర్టల్ ద్వారానే ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. వివిధ శాఖల్లో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఫిజికల్ దరఖాస్తులన్నింటినీ ఏప్రిల్ 30లోపు సంబంధిత కార్యాలయాలకు సమర్పించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. పెన్షన్ ప్రాసెసింగ్‌లో వేగం పెంచడమే లక్ష్యంగా తెచ్చిన ఈ డిజిటల్ విధానం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయి. ఫైల్ ఏ స్టేజ్‌లో ఉందో అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనే తెలుసుకోవచ్చు. కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, డిజిటల్ పద్ధతిలో వేగంగా ఆమోదం పొందే అవకాశం ఉంటుంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు సేవలు అందుతాయి. ఈ కొత్త విధానంపై అన్ని ప్రభుత్వ శాఖల అధిపతులకు, జిల్లా అధికారులకు ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఉద్యోగులు పదవీ విరమణ పొందే ముందే వారి పెన్షన్ పేపర్లను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగులకు, పెన్షనర్లకు మేలు చేకూరనుంది. పెన్షన్ మంజూరులో ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను తొలగించి, సిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడమే ఈ ఉత్తర్వుల ప్రధాన ఉద్దేశం.

## ప్రత్యేక రైళ్ల కొనసాగింపు..



**అమరావతి, పతాకం న్యూస్:** వేసవిలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లను మరికొన్ని రోజులు కొనసాగిస్తూ దక్షిణ మధ్య రైల్వే నిర్ణయం తీసుకుంది. తిరుపతి, తిరుచానూరు రైల్వేస్టేషన్ల నుంచి వివిధ నగరాలకు రైళ్లు నడపనున్నారు. 17న ట్రైన్ నెంబర్ 07605 తిరుపతి - అనకాపల్లి, 18న నాందేడ్ - తిరుచానూరు(07015), 19 తిరుచానూరు - నాందేడ్(07016), 19న చర్లపల్లి-తిరుచానూరు(07017), 19న అనకాపల్లి - తిరుపతి(07606), 20న తిరుచానూరు-చర్లపల్లి(07018), 20న జైపూర్-తిరుచానూరు (07609), 21న తిరుచానూరు-జైపూర్(07610), 21న తిరుపతి-చర్లపల్లి (07000), 22న చర్లపల్లి-తిరుపతి(07001), 23న తిరుపతి - చర్లపల్లి(07002), 24న చర్లపల్లి-తిరుపతి(07031), 22న చర్లపల్లి-తిరుచానూరు(07751), 23న తిరుచానూరు-చర్లపల్లి(07752), 23న కాచిగూడ-తిరుచానూరు (07787), 24న తిరుచానూరు-కాచిగూడ(07788)

## మనీలాండరింగ్ కేసులో ఐప్యాక్ వ్యవస్థాపకుడు అరెస్ట్, పదిరోజుల కస్టడీ

**కోల్‌కతా, పతాకం న్యూస్:** అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది వారాల ముందు పశ్చిమబెంగాల్‌లో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. మనీలాండరింగ్ కేసులో ఐప్యాక్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ వినేష్ చందేల్ కి ఢిల్లీ కోర్టు పదిరోజుల కస్టడీ విధించినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని వారాల ముందు ఈడి వినేష్‌ను అరెస్ట్ చేయడం గమనార్హం. విచారణ అనంతరం వినేష్‌ను సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆయన ఐప్యాక్‌లో 33శాతం వాటా కలిగి ఉన్నారు. ఐప్యాక్‌కి సంబంధించి ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను పరిగణనలోకి తీసుకుని నమోదు చేసిన కొత్త కేసులో ఆయనన అరెస్ట్ చేసినట్లు ఈడి అధికారులు వెల్లడించారు. ఈ కేసు బొగ్గు కుంభకోణం దర్యాప్తుతో ముడి ఉందని అన్నారు. ఐప్యాక్ 2021 నుండి టిఎంసికి, మమతా బెనర్జీ ప్రభుత్వానికి రాజకీయ సలహాలు అందిస్తోన్న సంగతి తెలిసిందే. పలు రాజకీయ పార్టీల నేతలు కూడా ఖాతాదారులుగా ఉన్నారు.


## తప్పిన పెను ప్రమాదం.. ఎయిర్‌పోర్టులో పేలిన సెల్‌ఫోన్

**హైదరాబాద్, పతాకం న్యూస్:**శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం పెను ప్రమాదం తప్పింది. ఓ ప్రయాణికుడి బ్యాగులో ఉన్న సెల్‌ఫోన్ బ్యాటరీ ఒక్కసారిగా పేలిపోవడంతో అక్కడున్న వారంతా భయాందోళనకు గురయ్యారు. అదే ఫోన్ విమానంలో పేలి ఉంటే ఘోరం జరిగేదని ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి. ఎయిర్‌పోర్టులోనే ఆ సెల్ ఫోన్ పేలిపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ వెళ్లేందుకు ఓ ప్రయాణికుడు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లాడు. విమానం ఎక్కే ముందు నిబంధనల ప్రకారం సీఐఎస్ఎఫ్ సిబ్బంది అతడి లగేజీని తనిఖీ చేస్తుండగా.. అతడి బ్యాగులోని సెల్‌ఫోన్ బ్యాటరీ ఒక్కసారిగా పేలిపోయింది. మంటలు, పొగ రావడంతో ప్రయాణికులు భయంతో పరుగులు తీశారు. భద్రతాసిబ్బంది వెంటనే అప్రమత్తమై పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బ్యాటరీ పేలడానికిగల కారణం విద్యుత్ షార్ట్ సర్క్యూటా లేక ఇతర సాంకేతిక లోపమా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనపై విమానాశ్రయ భద్రతా అధికారులు నివేదిక కోరారు.

# ఎగువ సీలేరు జల విద్యుత్ కేంద్రానికి కొత్త రూపు ..

## ఏటా గ్రిడ్‌కు సుమారు 3500 మిలియన్ యూనిట్ల విద్యుత్

**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర విద్యుత్ రంగ చరిత్రలో ఒక విశేషమైన అధ్యాయం ఆవిష్కృతం కాబోతోంది. ఆరు దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర కలిగిన 'అప్పర్ సీలేరు జల విద్యుత్ కేంద్రం' ఇప్పుడు ఆధునిక సాంకేతికత సాయంతో మార్పులకు సిద్ధమవుతోంది. కేవలం జల విద్యుత్ ఉత్పత్తికే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని విద్యుత్ మిగులు ప్రాంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, ఇది ఒక భారీ 'పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు'గా రూపుదిద్దుకుంటోంది. ఎగువ సీలేరు విద్యుత్ ప్రాజెక్టు ఆరు దశాబ్దాల తర్వాత కొత్త రూపు సంతరించుకోనుంది. ఇప్పటి వరకు జల విద్యుత్ ప్రాజెక్టుగా ఉన్న ప్రాంతం భారీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు(పీఎస్‌పీ)గా రూపాంతరం చెందనుంది. ఒక్కొక్కటి 150 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 9 వర్టికల్ ఫ్రాన్సిస్ రివర్సిబుల్ పంప్ టర్బైన్‌లు అండ్ సింక్రనైజ్డ్ మోటార్ జనరేటర్ సెట్‌లు ఏర్పాటు కానున్నాయి. 1,350 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో కొత్త ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. పీఎస్‌పీ ప్రాజెక్టు కోసం కేవలం పంప్‌హౌస్‌ను మాత్రమే ప్రస్తుతం నిర్మించనున్నారు. ఎగువ రిజర్వాయర్ గుంటవాడగా, దిగువ రిజర్వాయర్ డొంకరాయినిగా వినియోగిస్తారు. పగటి వేళల్లో పునరుత్పాదక విద్యుత్ అదనంగా ఉన్నప్పుడు ఎగువ రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోసి పీక్ డిమాండ్ వేళల్లో ఆ నీటితో విద్యుత్ ఉత్పత్తి చేసి దిగువ రిజర్వాయర్‌కు పంపేలా ప్రాజెక్టును రూపొందించారు. విద్యుత్ ఉత్పత్తి కోసం సుమారు 1.70 టీఎంసీల నీరు అవసరమవుతుంది. 2029 నాటికి పీఎస్‌పీ ప్రాజెక్టును పూర్తి చేయాలన్నది లక్ష్యం. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి ఏజెన్సీ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో దీన్ని నిర్మిస్తున్నారు. దీని ద్వారా ఏటా సుమారు 3,500 మిలియన్ యూనిట్ల విద్యుత్ గ్రిడ్‌కు అందుతుందని అంచనా. ఈ ప్రాంతంలో సగటు వార్షిక వర్షపాతం 1,388 మిల్లీ మీటర్లు ఉండటం వల్ల నిరంతర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీటి ప్రవాహం అందుబాటులో ఉంటుంది. గుంటవాడ రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 3.66 టీఎంసీలుగా ఉంది. కొత్తగా నిర్మిస్తున్న పీఎస్‌పీ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి 1.7 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించనున్నారు. మిగిలిన నీరు రిజర్వాయర్‌లోనే ఉంటుంది. అది పోను రిజర్వాయర్‌లో ఉన్న నీటి ద్వారా



ఎగువ సీలేరులో ప్రస్తుతం ఉన్న జల విద్యుత్ ప్రాజెక్టు ద్వారా యథావిధిగా విద్యుత్ ఉత్పత్తికి వినియోగించుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఇక్కడ ఒక్కొక్కటి 60 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఇక్కడ హెడ్ (నీటి ఎత్తు) సుమారు 92.58 మీటర్లుగా ఉంది. ఎక్కువ హెడ్ ఉండటం వల్ల మీడియం హెడ్ జల విద్యుత్ కేంద్రాలకు అనువైన వర్టికల్ ఫ్రాన్సిస్ టర్బైన్ జనరేటర్లను వినియోగించారు. వాటిలో పంప్ సైజు తక్కువగా ఉన్నప్పటికీ హెడ్ ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువ విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఏర్పడింది. పాత కాలపు పటిష్టతకు భవిష్యత్తు సాంకేతికతకు ఒక అద్భుత సాక్ష్యంగా ఎగువ సీలేరు నిలవనుంది. ప్రస్తుతం ఉన్న జల విద్యుత్ ప్రాజెక్టు ద్వారా ఏటా సుమారు 575 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ ఉత్పత్తి అందుతోంది. తొలిదశలో ఏర్పాటు చేసిన రెండు యూనిట్లు 1967-68లో ఏర్పాటయ్యాయి. వాటికి అవసరమైన టర్బైన్లను స్విట్జర్లాండ్‌కు చెందిన ఎక్స్‌చర్‌వైస్ అండ్ చార్మిల్స్ సంస్థ సరఫరా చేసింది. జనరేటర్లను ఓర్లికాన్ అందించింది. 1994-95లో మరో రెండు యూనిట్లు ఏర్పాటు చేశారు. వాటిని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ అభివృద్ధి చేసింది. ప్లాంట్ల సాధారణ కాలపరిమితి 35 ఏళ్లు అయినప్పటికి క్రమబద్ధమైన ఆధునికీకరణ, నిర్వహణ పనులతో ఇప్పటికీ సమర్థంగా పనిచేస్తోంది. సుమారు ఆరు దశాబ్దాల కిందట ప్రారంభ మైనప్పటికీ నేటికీ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి నెట్‌వర్క్‌లో కీలక పాత్ర పోషిస్తోంది. బలిమెల రిజర్వా యర్‌కు దిగువన గుంటవాడ వద్ద నిర్మించిన వియర్ ద్వారా సీలేరు నది నీటిని ప్రాజెక్టు కోసం వినియో గిస్తున్నారు. మొత్తానికి, ఎగువ సీలేరు ప్రాజెక్టు ఆధుని కీకరణ రాష్ట్ర విద్యుత్ రంగంలో ఒక నవశకానికి నాంది పలకనుంది. ఆరు దశాబ్దాల క్రితం స్విట్జర్లాండ్ సాంకేతికతతో మొదలై, నేడు స్వదేశీ 'భెల్' సహకారంతో ప్రపంచ స్థాయి పంప్డ్ స్టోరేజ్ టెక్నాలజీ వైపు అడుగులు వేయడం హర్షణీయం. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం మాత్రమే కాదు పాత కాలపు పటిష్టతకు, రేపటి తరం సాంకేతికతకు ఒక అద్భుత మేళవింపుగా నిలవనుంది.

# జీసీసీ తీరుతో నష్టపోతున్న చింతపండు గిరిజన రైతులు

**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** చింతపండు సేకరించే గిరిజన రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. గిరిజన రైతులకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో ఇటీవల ప్రభుత్వం కిలో చింతపండు ధరను రూ.36 నుంచి రూ.45కు పెంచింది. అయితే బహిరంగ మార్కెట్‌లో ధర, పంట దిగుబడి ఇతర పరిస్థితుల రీత్యా.. అదనంగా మరో రూ.10 పెంచుతూ ఇకపై కిలో చింతపండును రూ.55కి కొనుగోలు చేయనున్నట్లు గిరిజన సహకార సంస్థ(జీసీసీ) వెల్లడించింది. కాగా ప్రస్తుతం ధర ఉన్నా.. ఆశించిన స్థాయిలో దిగుబడి లేక రైతులు నిరాశ చెందుతున్నారు. జిల్లాలో 1,15,892 ఎకరాల్లో అటవీ ప్రాంతం ఉంది. మెళియాపుట్టి, నందిగాం, మందస పాతపట్నం, కోత్తూరు, హిరమండలం, పలాస, టెక్కలి మండలాల్లో చింతచెట్లు అధికంగా ఉన్నాయి. పలాస మండలం పొత్రియ, బాపనూరు, గట్టూరు, కొఠారింగి తాళభద్ర తదితర గిరిజన గ్రామాల్లో రైతులు చింత పంటపైనే ఆధారపడుతుంటారు. తితలీ తుఫాన్ సమయంలో చాలా చెట్లు నేలకొరిగాయి. అలాగే గతేడాది దసరా నుంచి ఇప్పటివరకూ సరైన వర్షాలు లేక ఆశించిన స్థాయిలో చింత పంట దిగుబడి రాలేదు. కొన్ని ప్రాంతాల్లో మెట్టభూముల్లో సైతం చింతచెట్లు పెంచినా.. అక్కడా దిగుబడి అంతంతమాత్రమే. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు చింతపండు ఎగుమతి అయ్యేది. కానీ ఈ ఏడాది జిల్లాలో దిగుబడి లేక.. ఒడిశా నుంచి ఇక్కడకు చింతపండు దిగుమతి అవుతోంది. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాలోని జిరాంగో, లంజిభద్ర గ్రామాలతోపాటు కాశీనగర్, గురండి, గుసాని ప్రాంతాల నుంచి చింతపండు తెచ్చి.. సంతలు, మార్కెట్‌లో కిలో రూ.65 నుంచి రూ.75 వరకు విక్రయిస్తున్నారు. చింతపండు ధర అటు మార్కెట్‌లో.. ఇటు జీసీసీలో ఆశాజనకంగా ఉన్నా.. వ్యాపారుల జోక్యంతో గిరిజన రైతులకు నష్టం వాటిల్లుతోంది. అసలుకే పంట దిగుబడి లేకపోగా.. ఉన్న పంటను కూడా దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. సరైన కొనుగోలు కేంద్రాలు లేకపోవడం, సమాచారం లోపించడం వలన వ్యాపారులపై ఆధారపడుతున్నారు. ఇదే అదునుగా వారు కిలో రూ.40కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. జీసీసీ ఈ ఏడాది చింతపండు కొనుగోలు ధరను పెంచినప్పటికీ



గ్రామస్థాయిలో కొనుగోలు కేంద్రాలు సరిగా పని చేయకపోవడం వలన గిరిజనులకు ఆ లాభం అందడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పలుచోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదని, ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి ఉందని గిరిజనులు వాపోతున్నారు. కొంతమంది వ్యాపారులు గతేడాది కోల్డ్‌స్టోరేజ్‌ల్లో నిల్వ ఉంచిన చింతపండును ప్రస్తుతం కిలో రూ.80 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అటు రైతులకు నష్టం, ఇటు వినియోగదారులకు భారం ఉండగా.. వ్యాపారులకు మాత్రం చింతపండు ధర కలిసొచ్చిందనే వాదనలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి జీసీసీ కొనుగోలు కేంద్రాలను గ్రామస్థాయిలో ఏర్పాటు చేసి.. అవగాహన కల్పిస్తే గిరిజనులు నష్టపోకుండా ఉంటారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## లౌకిక రాజ్యంగాన్ని కాపాడుకుందాం



**విజయవాడ, పతాకం న్యూస్:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నాయకత్వంలో తయారైన లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సిపిఐయం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం దగ్గర అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ .... మతోన్మాదుల పాలనలో రాజ్యాంగం ఈ రోజు తీవ్రమైన ప్రమాదంలో పడిందని అన్నారు. రాజ్యాంగంలో ఉన్నటువంటి మౌలికమైన లౌకికవాదమే ప్రమాదంలో పడిందన్నారు. దాని పరిరక్షణ కోసం, కాపాడుకునేందుకు మొత్తం ప్రజాతంత్రవాదులు సామాజిక వేత్తలు అందరూ ఐక్యమై ముందుకు రావాలని కోరారు. మత సామరస్యం దెబ్బతింటోందని, మతం పేరుతో దళితుల్లో చీలికలు తీసుకొచ్చి హిందువులు క్రైస్తవులు అనే పేరుతో చీలికలు తెస్తున్నారని విమర్శించారు. ఈరోజు క్రైస్తవుల మీద దళిత క్రైస్తవుల మీద దాడులు జరగడం అన్యాయమన్నారు. మన రాష్ట్రం ఇంతవరకు శాంతి సామరస్యాలతో ఉందని, అయితే ... క్రైస్తవులకి ముస్లింలకి వ్యతిరేకంగానూ, మైనారిటీలని అణచివేసేందుకు కుట్రపూరిత చర్యలకు దిగుతున్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే దీనికి ప్రోత్సాహం ఇవ్వడం బాధాకరమన్నారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి మంత్రులు అధికారంలోకి వచ్చినటువంటి వాళ్ళు ఈ మత సామరస్యాన్ని కాపాడటానికి లౌకికవాదాన్ని కాపాడడానికి ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి ముందుకు రావాలి అని తెలిపారు. అలాగే కుల నిర్మూలన కోసం పట్టుదలతో పని చేయాలని పిలుపునిచ్చారు. కుల ఆస్తిత్వం ఉన్నంత కాలం కుల నిర్మూలన సాధ్యం కాదని బాబాసాహెబ్ అంబేద్కర్ కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారన్నారు. ఈరోజు అనేక జిల్లాల్లో కులాంతర వివాహాలు చేస్తున్నవాళ్ళని సొంత కుటుంబీకులే హత్యలు చేస్తున్నారని, పరువు పేరుతో ఈ హత్యల నుండి కాపాడటానికి కులాంతర వివాహాలు చేసుకున్న వాళ్ళకి రక్షణ కల్పించడానికి ఒక ప్రత్యేక చట్టం కూడా చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే దళిత క్రిస్టియన్ల మీద జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు దళిత క్రిస్టియన్ల అందరిని కూడా ఎస్సీలుగానే గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐయం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంధ్ర మాల్యాద్రి, జె. జయరాం, యు. వి. రామరాజు పాల్గొన్నారు.

## టిడ్కో గృహ రుణాలు రద్దు చేయాలని ధర్నా




**సామర్లకోట, పతాకం న్యూస్:** టిడ్కో గృహ రుణాలు రద్దు చేయాలని ధర్నా ప్రజాశక్తి- సామర్లకోటఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం టిట్కో గృహ రుణాలు రద్దు చేయాలని టిడ్కో గృహాల రుణాలు రద్దు చేయాలని స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలోని జగ్గమ్మగారి పేటలో 500 టిడ్కో గృహ సముదాయాలు ఉన్నాయని తెలిపారు. గత వైసిపి హయాంలో నిర్మించిన ఈ గృహాలు ఆనాడు లబ్ధిదారులకు ం౦1గా నిర్మిస్తామని చెప్పి తరువాత దాన్ని ం౦3గా మార్పు చేశారు. ఒక్కొక్క ప్లాట్‌కు రూ.7 లక్షల విలువ నిర్ణయించారు. దీనిలో రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షా 50 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.లక్షా 50 సబ్సిడీ మొత్తం రూ.3 లక్షలుగా నిర్ణయించారన్నారు. లబ్ధిదారుల నుంచి అడ్వాన్సుగా రూ.లక్ష తీసుకున్నారని ఇక మిగిలిన రూ.3 లక్షల రుణం ప్రతి నెలా బ్యాంకులో చెల్లించమని చెప్పారన్నారు. కానీ వాస్తవంలో చూస్తే నెలకు రూ.4000 చొప్పున 20 ఏళ్లు చెల్లించాలని చెప్తున్నారన్నారు. ఇలా చూస్తే ఈ మొత్తం సుమారు రూ.10 లక్షలు అవుతుందని, ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాల్సిన ఇళ్లకు రూ.3 లక్షలు రుణం అని చెప్పి, రూ.10 లక్షలు వసూలు చేయడం వల్ల తీవ్రమైన రుణభారం అవుతుందని తెలిపారు. టిడ్కో లబ్ధిదారులకు డ్వాక్రా రుణాలు వచ్చిన సరే వారికి ఇవ్వకుండా బ్యాంకులు జమ చేసుకుంటున్నాయని, తల్లికి వందనం సొమ్ములు కూడా దీనికి జమ చేసుకుంటున్నారని, బంగారంపై తీసుకున్న రుణాల సొమ్మును కూడా జమ వేసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల సొమ్మును లబ్ధిదారులకు చెందకుండా బ్యాంకులు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల మాదిరిగా దోచేస్తున్నాయన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో సిఎం చంద్రబాబు రుణాలు చెల్లించవద్దని, రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు ఎటువంటి ప్రకటనా చేయలేదని చెప్పారు. కాబట్టి తక్షణమే ప్రజలకు రుణ భారంగా ఉన్న గృహ రుణాలను రద్దు చేసి, ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కె.పద్మజకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.వరలక్ష్మి, కె.వెంకటలక్ష్మి, పి.లక్ష్మి, ఎన్.శాంత లీల, వై.శ్రీదేవి, డి.మహేశ్వరి, ఎ.దుర్గ లక్ష్మి, సిపిఎం నాయకులు కరణం గోవిందరాజు, బాలం సత్తిబాబు, చరణ్ పాల్గొన్నారు.

## జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

**భీమవరం, పతాకం న్యూస్:** విద్యార్థులు చదువుతోపాటు నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం మెంటే వారి తోటలో వండర్ కిడ్స్ స్కూల్ 33వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ విద్య అనేది ఎంతో గొప్పదని, ప్రతిఒక్కరూ చదువుకోవాలని, విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. అనంతరం ఎంఎల్ఎను సత్కరించారు. జబర్దస్త్ నటులు ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## నిప్పుల కొలిమిలా ఏపీ.. పలు ప్రాంతాల్లో 44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీలో సూర్యుడు ప్రతాపం చూపిస్తుండటంతో రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారుతోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాయలసీమ, కోస్తా జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా 33 మండలాల్లో తీవ్రమైన వడగాల్పులు, మరో 44 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అంచనా వేసింది. విపత్తుల నిర్వహణ సంస్థ నివేదిక ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లాలో 15, విజయనగరం జిల్లాలో 9, శ్రీకాకుళంలో 4, పోలవరంలో 3, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1, ఏలూరు జిల్లాలోని ఒక మండలంలో తీవ్ర వడగాలుల ప్రభావం ఉండనుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలను విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. అత్యధికంగా కడపలో 44.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. నంద్యాల జిల్లా సంజామలలో 44 డిగ్రీలు, తిరుపతి జిల్లా వరదయ్యపాళెంలో 43.8, మార్కాపురం జిల్లా అనుమలపల్లిలో 43.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కర్నూలు జిల్లా గూడూరులో 43, పల్నాడు జిల్లా దుర్గిలో 42.8, అనంతపురం జిల్లా రాయదుర్గంలో 42.7, నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 42.4 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదైనట్లు సంస్థ పేర్కొంది. ఎండ తీవ్రత, ఉక్కపోత దృష్ట్యా ప్రజలు వీలైనంత వరకు ఇళ్లకే పరిమితం కావాలని అధికారులు కోరుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించారు. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి తప్పనిసరిగా వాడాలని, డీహైడ్రేషన్ బారిన పడకుండా తరచుగా నీళ్లు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## స్మార్ట్ ఫోన్లతో డేటా సేకరణ వేగవంతం

**కోనసీమ, పతాకం న్యూస్:** ప్రభుత్వ సంక్షేమ పథకాల డేటాను వేగవంతంగా సేకరించేందుకు స్మార్ట్ ఫోన్‌లు ఎంతో దోహదం చేస్తాయని అమలాపురం ఎంపీ గంటి హరీష్, ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. మండల మహిళా సమైఖ్య(వెలుగు) కార్యాలయం నందు మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రాజెక్టు నందు విఒఎలు గా విధులు నిర్వహిస్తున్న 147 మందికి స్మార్ట్ ఫోన్లను ఎంపీ హరీష్, ఎంఎల్ఎ సుబ్బరాజు చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారిద్దరు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను పారదర్శకంగా అమలు చేసి లబ్ధిదారులకు అందించడంలో స్మార్ట్ ఫోన్లు ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు.

## 22 నుంచి తెలంగాణలో ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె




**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణలో ఆర్టీసీ సమ్మె సైరన్ మోగింది. ఈ నెల 22వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళుతున్నట్లు తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. గత నెల 13వ తేదీన యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చినట్లు తెలిపింది. కానీ యాజమాన్యం నుంచి ఎలాంటి హామీ రాలేదని వెల్లడించింది. ప్రభుత్వం, యాజమాన్యం ముందు తాము 32 డిమాండ్లను ఉంచామని పేర్కొంది. ఈ మేరకు ఆర్టీసీ జేఏసీ వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే సమ్మె నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె నుంచి వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు ఇవ్వాలని పలు డిమాండ్లు యాజమాన్యం ముందు ఉంచినట్లు తెలిపారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**ఏలూరు, పతాకం న్యూస్:** కొయ్యలగూడెం మండలంలోని స్థానిక ప్రకాశం డిగ్రీ కళాశాలలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల కరస్పాండెంట్ వద్ది జనార్ధన్‌రావు మాట్లాడుతూ అంబేద్కర్ గొప్ప న్యాయవేత్త, ఆర్థికవేత్త, సామాజిక సంస్కర్తగా దేశానికి అపార సేవలు అందించారని తెలిపారు. కళాశాల ప్రధాన అధ్యాపకులు సిహెచ్.హనుమాన్ చౌదరి మాట్లాడుతూ సమాజంలో అణగారిన తరగతుల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని అంబేద్కర్ జీవిత చరిత్ర, ఆయన చేసిన సేవలు, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ఇ.పవన్ దుర్గా కుమార్, అధ్యాపకులు కె.రాజాజీ, కె.షారోన్ ఎలిజిబిత్, తరుణ్, దివ్య శ్రీతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# డయాబెటిస్, హైబీపీ ఉన్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలి..



డయాబెటిస్, హైబీపీ ఉన్నవారు ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త పడాల్సిందే.. ఎందు కంటే..? కిడ్నీ వ్యాధి చాలా సార్లు నెమ్మదిగా అభివృద్ధి చెందుతుంది. అందుకే దీనిని నిశ్శబ్ద వ్యాధిగా కూడా పిలుస్తారు. ముఖ్యంగా అధిక రక్తపోటు లేదా మధుమేహం ఉన్న కోట్లాది మంది వ్యక్తుల్లో కిడ్నీ నష్టం ప్రమాదం కాలక్రమేణా పెరుగుతుంది. అయితే చాలా మంది ఈ సమస్యను గుర్తించలేకపోతారు. కిడ్నీ వ్యాధి చాలా సార్లు నెమ్మదిగా అభివృద్ధి చెందుతుంది. అందుకే దీనిని నిశ్శబ్ద వ్యాధిగా కూడా పిలుస్తారు. ముఖ్యంగా అధిక రక్తపోటు లేదా మధుమేహం ఉన్న కోట్లాది మంది వ్యక్తుల్లో కిడ్నీ నష్టం ప్రమాదం కాలక్రమేణా పెరుగుతుంది. అయితే చాలా మంది ఈ సమస్యను గుర్తించలేకపోతారు. ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి (జఖణ)కి ప్రధాన కారణాలను వైద్యులు తెలియజేస్తున్నారు. తాజా పరిశోధనల ప్రకారం 35 ఏళ్లలోపు హైపర్‌టెన్షన్ వచ్చినవారిలో కిడ్నీ వ్యాధి ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుందని వెల్లడైంది. కిడ్నీలు రక్తంలోని వ్యర్థాలను, అదనపు ద్రవాలను వడపోసే చిన్న రక్తనాళాలతో నిర్మితమై ఉంటాయి. రక్తపోటు ఎక్కువకాలం ఎక్కువగా ఉంటే, ఈ సున్నితమైన రక్తనాళాలు దెబ్బతింటాయి. కాలక్రమేణా ఈ నష్టం కిడ్నీల పనితీరును తగ్గిస్తుంది. అయితే ఈ మార్పులు నెమ్మదిగా జరుగుతాయి కాబట్టి ప్రారంభ దశలో లక్షణాలు కనిపించవు. శరీరం కూడా ఈ మార్పులకు కొంతకాలం అలవాటు పడుతుంది. అదేవిధంగా డయాబెటిస్ కారణంగా రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అధిక గ్లూకోజ్ కారణంగా కిడ్నీలు ఎక్కువగా పని చేయాల్సి వస్తుంది. దీని వల్ల గ్లోమెరులీ అనే వడపోత యూనిట్లు దెబ్బతింటాయి. ఈ పరిస్థితిని డయాబెటిక్ నెఫ్రోపతి అని పిలుస్తారు. ఇది పెద్దల్లో కిడ్నీ ఫెయిల్యూర్‌కు ముఖ్య కారణంగా నిలుస్తోంది. పరిశోధనలు చెబుతున్నట్లుగా డయాబెటిస్ ఉన్న వారిలో దాదాపు 40 శాతం మందికి అల్బ్యూమిన్ స్థాయిలు సాధారణంగా ఉన్నప్పటికీ కిడ్నీ పనితీరు తగ్గిపోతూ ఉంటుంది. కిడ్నీలు దెబ్బతిన్నప్పటికీ మిగిలిన ఆరోగ్యకరమైన భాగం కొంతకాలం పనిని నిర్వహిస్తుంది. అందువల్ల లక్షణాలు ఆలస్యంగా మాత్రమే బయటపడతాయి. ఎక్కువగా రక్తం లేదా మూత్ర పరీక్షలు చేసినప్పుడు మాత్రమే ఈ వ్యాధి గుర్తించబడుతుంది. కిడ్నీ వ్యాధి ముదిరిన తర్వాత కొన్ని హెచ్చరిక సంకేతాలు కనిపించవచ్చు. కాళ్లు, మోకాళ్లు లేదా చేతుల్లో వాపు, అలసట, రాత్రిపూట తరచుగా మూత్ర విసర్జన, చర్మంలో దురద, ఏకాగ్రత లోపం వంటి లక్షణాలు ఉండవచ్చు. అయితే ఇవి సాధారణ సమస్యలుగా భావించి చాలామంది నిర్లక్ష్యం చేస్తారు. అధిక రక్తపోటు లేదా డయాబెటిస్ ఉన్నవారు నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం. కిడ్నీ పనితీరును తెలుసుకోవడానికి రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు చేయిస్తారు. మూత్రంలో ప్రోటీన్ లీకేజీ కనిపించడం కిడ్నీ నష్టానికి ప్రారంభ సంకేతం కావచ్చు. ప్రారంభ దశలో కిడ్నీ వ్యాధిని గుర్తిస్తే ఔషధాలు, జీవనశైలి మార్పులు, రక్తపోటు, చక్కెర నియంత్రణ ద్వారా వ్యాధి పురోగతిని తగ్గించవచ్చు. సరైన ఆహారం తీసుకోవడం, ఉప్పు వినియోగాన్ని తగ్గించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, అవసరం లేని మందులు వాడకపోవడం కిడ్నీ ఆరోగ్యానికి సహాయపడుతుంది. అధిక రక్తపోటు, డయాబెటిస్ కారణంగా వచ్చే కిడ్నీ వ్యాధి ప్రారంభ దశలో పెద్దగా లక్షణాలు చూపదు. అందుకే ఇది చాలా ప్రమాదకరంగా మారుతుంది. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

# ఇరాన్ నౌకల దిగ్బంధనం ప్రారంభించిన అమెరికా..



**ఇరాన్:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరో మలుపు తిరిగాయి. హర్మ్యూజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్ ససేమిరా అంటుండగా ఆ దేశ ఓడరేవులను అమెరికా దిగ్బంధించడం ప్రారంభించింది. ఇరాన్ ఓడరేవుల్లోకి ప్రవేశించే, అక్కడి నుంచి బయటకు వెళ్లే అన్ని నౌకలను అడ్డుకుంటోంది. తమ ఓడరేవులను దిగ్బంధిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించిన ఇరాన్, తమ ఓడరేవుల భద్రతకు ముప్పు వాటిల్లితే పర్షియన్ గల్ఫ్, ఒమన్ సముద్రంలోని ఏ దేశపు ఓడరేవూ సురక్షితంగా ఉండదని ఇప్పటికే తేల్చిచెప్పింది. అమెరికా చర్యలతో ఇరాన్ ప్రతిచర్యలు ఎలా ఉంటుందనేది ఉత్కంఠగా మారింది. ఇరాన్-అమెరికా మధ్య శాంతి చర్చలు విఫలమైన తర్వాత హర్మ్యూజ్ జలసంధిని తిరిగి తెరిపించే వ్యూహంలో భాగంగా అధ్యక్షుడు ట్రంప్ కఠిన చర్యలకు దిగారు. ఇరాన్ ఓడరేవులకు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే నౌకలను అడ్డుకోవాలని అమెరికా నౌకాదళాన్ని ఆదేశించగా ఆ మేరకు చర్యలు ప్రారంభమయ్యాయి. ట్రంప్ ఆదేశాల మేరకు అమెరికా నౌకాదళం పెద్దఎత్తున బలగాలను రంగంలోకి దించింది. ఖూా అబ్రహం లింకన్, ఖూా రోనాల్డ్ రీగన్ అనే రెండు క్యారియర్ స్ట్రైక్ గ్రూపులను మోహరించింది. ఈ రెండు యాంఫిబియస్ రెడీ గ్రూపుల్లో మొత్తం 20 యుద్ధనౌకలు, 200 పైగా విమానాలు ఉంటాయి. వాటిని ఇరాన్‌కు సమీపంగా తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. హర్మ్యూజ్ జలసంధిలో ఇరాన్ అమర్చిన మైన్‌లను తొలగించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైనట్లు ఖూ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఇరాన్‌కు వచ్చి వెళ్లే అన్ని నౌకలను అడ్డుకుంటామని చెప్పిన అమెరికా, ఏ దేశమైనా సరే అనుమతి తీసుకోవాల్సిందేనని తేల్చిచెప్పింది. ఆహార, వైద్య సంబంధ నౌకలను మాత్రం తనిఖీల తర్వాత అనుమతిస్తామని తెలిపింది. దీంతో పాటు ఆంక్షలు విధించిన ఇరాన్ చమురును కొనుగోలు చేసే లేదా విక్రయించే ఎవరిపైనైనా తీవ్రంగా విచారణ జరుపుతామని అమెరికా హెచ్చరించింది. మరోవైపు ఇరాన్‌కు చెందిన 158 నౌకలను అమెరికా దళాలు పూర్తిగా ధ్వంసం చేశాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. అవి ఇప్పుడు సముద్ర గర్భంలో ఉన్నాయని వెల్లడించారు. ఇరాన్ వద్ద ఉన్న ఫాస్ట్ అటాక్ షిప్స్‌ను ఇప్పటివరకు లక్ష్యంగా చేసుకోలేదని, వాటిని పెద్ద ముప్పుగా భావించడం లేదన్నారు. ఒకవేళ ఆ నౌకలు అమెరికా విధించిన దిగ్బంధనం వైపు వస్తే మాత్రం వాటిని వెంటనే నాశనం చేస్తామంటూ హెచ్చరించారు. సముద్ర మార్గం ద్వారా అమెరికాలోకి వచ్చే డ్రగ్స్‌ను 98.2 శాతం వరకు నిలిపివేశామని ట్రూత్ వేదికగా పోస్ట్ చేశారు.

# వేసవిలో పశువులను జాగ్రత్తగా చూసుకోవాలి

## పశు వైద్య శాస్త్రవేత్తల సూచన



**చింతపల్లి, పతాకం న్యూస్:** వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులు, మేకలు, గొర్రెలు పలురకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటాయి. సహజంగా 18-35 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత పశువులకు సౌకర్యంగానే ఉంటోంది. ఆపై అధిక ఉష్ణోగ్రత నమోదైతే పశువులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. వడదెబ్బ కారణంగా పశువులు మృతి చెందే అవకాశముంది. వేసవిలో పశువులకు కావాల్సినంత మేత దొరక్కపోవడంతో వ్యాధి నిరోధకశక్తి తగ్గుతోంది. ఈ కారణంగా పశువులు పలు రకాల సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రధానంగా పశువుల్లో పోషకాహార లోపం కారణంగా వ్యాధి నిరోధకశక్తి తగ్గి గొంతువాపు, గాలికుంటూ, జబ్బవాపు వ్యాధులు సోకే అవకాశముంది. దీంతోపాటు కలుషితమైన నీరు తాగడం, పశువులను కడగడంతో అంతర, బాహ్యపరాన్న జీవుల సమస్యలు అధికమవుతాయి. ఈ వ్యాధులు రాకుండా పాడి రైతులు వేసవి ప్రారంభంలోనే ప్రతి పశువుకు వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలి. అంతర, బాహ్యపరాన్న జీవుల నివారణకు నట్టల మందులు వేయించాలి. సమతుల్యమైన పోషకాలు కలిగిన ఆహారం, పరిశుభ్రమైన నీరు తగు మోతాదులో పశువులకు అందించాలి. సాధారణంగా వేసవిలో జీర్ణక్రియ సమస్యలు పశువుల్లో అధికంగా కనిపిస్తాయి. పశువుకు కావాల్సినంత మేత లభించకపోవడం, వేడి కారణంగా తక్కువ ఆహారం తీసుకోవడం, పరిశుభ్రమైన నీరు తాగకపోవడం వల్ల మలబద్ధకం, పారుడు రోగాలు వస్తాయి. అధిక ఉష్ణోగ్రత కారణంగా పశువులు ఎదకు రాకుండా పోతాయి. హార్మోన్ల ఉత్పత్తి తగ్గడంతో పశువులలో అండాలు సరిగ్గా ఉత్పత్తికావు. శరీరంలో గ్లూకోజ్ పరిమాణం తగ్గడంతో అండాశయాల్లో స్తబ్ధత, అండోత్పత్తి వ్యత్యాసాలు సంభవించి పశువులు తిరిగి పొర్లుతుంటాయి. పశువులు ఎండుగడ్డి ఎక్కువగా తినడం వలన విటమిన్‌ఏ, కాపర్, మెగ్నీషియం, ఖనిజ లవణాల లోపం ఏర్పడి పశువులలో తాత్కాలిక వంధత్వం కలుగుతుంది. వేసవిలో పశువులు నీరు ఎక్కువగా తాగి మేత తక్కువగా తింటాయి. ఈ కారణంగా పాల దిగుబడి తగ్గిపోతుంది. ఈ సమస్యతో వేసవిలో మన దేశంలో పాల కొరత సమస్య కలుగుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు పశువులకు అవసరమైన ఆహారాన్ని అందించాలి. పశువులను మేత కోసం పొలాలు, అడవుల్లోకి తీసుకువెళతారు. వేసవిలో ఇలా చేయడం వల్ల పశువులు అధిక వేడిని తట్టుకోలేక వడదెబ్బకు గురవుతాయి. పశువులు ఎక్కువ సమయం ఎండలో ఉండడం, తాగునీరు పూర్తి స్థాయిలో లభించకపోవడం వల్ల వడదెబ్బకు గురవుతాయి. పశువు శరీర ఉష్ణోగ్రత, శ్వాస, నాడి వేగం బాగా పెరుగుతుంది. కొన్ని సందర్భాల్లో అపస్మారక స్థితికి చేరుకుని చనిపోయే ప్రమాదముంది. పశువుల్లో ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వడదెబ్బ తగిలిందని గుర్తించాలి. వెంటనే చల్లని ప్రదేశానికిగాని, షెడ్‌లోకిగాని తీసుకు వెళ్లాలి. పశువును చల్లటి, శుభ్రమైన నీటితో కడగాలి. పశువు తాగినంత నీరు ఇవ్వాలి. ప్రథమ చికిత్స కూడా అందించాలి. ప్రధానంగా ఉదయం 6గంటల నుంచి 11గంటలు, సాయంత్రం 4గంటల నుంచి 6 గంటల మధ్య కాలంలోనే పశువులను మేత కోసం బయటకు తీసుకువెళ్లాలి.

వేసవిలో అధిక వేడి నుంచి పశువులను కాపాడుకోవడానికి మంచి వసతి ఏర్పాటుచేసుకోవాలి. గాలి, వెలుతురు బాగా ప్రసరించే విధంగా నిర్మించుకోవాలి. సూర్యరశ్మి నేరుగా షెడ్‌లోకి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చుట్టూ చెట్లు ఉండే ప్రాంతంలో పాక నిర్మించాలి. సిమెంట్ రేకులు కలిగిన షెడ్‌పై వేసవిలో 8-10సెంటీమీటర్ల మందంగా గడ్డిని కప్పాల్సి ఉంటుంది. వడగాలులు తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో గోనె సంచులను కట్టి చల్లని నీటితో తడుపుతూ ఉండాలి.




# సన్‌రైజర్స్ హైదరాబాద్ ఘన విజయం



ఎట్టకేలకు సొంత వేదికపై సన్‌రైజర్స్ హైదరాబాద్ అదరగొట్టింది. ఈ ఐపీఎల్‌లో ఓటమి లేకుండా దూసుకెళుతున్న రాజస్థాన్ రాయల్స్‌కు ముకుతాడు వేసింది. ఇషాన్ కిషన్ (44 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 91) జోరుతో బ్యాటింగ్‌లో భారీ స్కోరు చేసిన రైజర్స్.. తొలిసారి బౌలింగ్‌లోనూ వహ్వా అనిపించింది. సీనియర్లను పక్కనబెట్టి యువ పేసర్లు ప్రఫుల్ హింగే, సకీబ్ హుస్సేన్‌లకు తొలిసారి అవకాశమివ్వగా.. ఆ ఇద్దరు నాలుగేసి వికెట్లతో చెలరేగడం విశేషం. దీంతో జరిగిన ఈ మ్యాచ్‌లో రైజర్స్ 57 పరుగులతో ఏకపక్ష విజయాన్ని అందుకుంది. ముందుగా సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 216 పరుగులు చేసింది. క్లాసెన్ (26 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 40), నితీశ్ (13 బంతుల్లో 4 సిక్సర్లతో 28), సలీల్ అరోరా (13 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 24 నాటౌట్) రాణించారు. ఆర్చర్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో రాజస్థాన్ 19 ఓవర్లలో 159 రన్స్‌కు ఆలౌటైంది. ఫెరీరా (44 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 69), జడేజా (32 బంతుల్లో 5 ఫోర్లతో 45), తుషార్ దేశ్‌పాండే (11 బంతుల్లో 3 సిక్సర్లతో 25) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. మలింగ 2 వికెట్లు తీశాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ప్రఫుల్ నిలిచాడు. 1, 0, 0, 0, 4.. భారీ ఛేదన బరిలోకి దిగిన రాజస్థాన్ టాప్-5 ఆటగాళ్ల స్కోర్లివి. తొలి 3 ఓవర్లలోనే ఏకంగా 5 వికెట్లు కోల్పోవడంతో ఇదంతా కలా? నిజమా? అనే భ్రాంతిలో ఉండిపోయింది. ఐపీఎల్ అరంగేట్ర పేసర్ ప్రఫుల్ హింగే సృష్టించిన మాయాజాలమిది. బుమ్రా, హాజెల్‌వుడ్ వల్ల కాలేకపోయిన వైభవ్ సూర్యవంశీ (0) జోరును అతడు ఒక్క బంతికే నిలువరించాడు. ప్రఫుల్ షార్ట్ డెలివరీని ఆడలేకపోయిన వైభవ్ కీపర్ సలీల్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో రైజర్స్ ఆటగాళ్లతో పాటు స్టేడియంలో ఫుల్ జోష్ కనిపించింది. ఆ ఆనందాన్ని రెట్టింపు చేస్తూ జురెల్, ప్రిటోరియస్‌లను కూడా డకౌట్ చేయడంతో మొదటి ఓవర్‌లోనే మూడు వికెట్లతో ప్రఫుల్ లీగ్‌లో సరికొత్త రికార్డు నెలకొల్పాడు. ఇక రెండో ఓవర్‌లో జైస్వాల్ (1)ను మరో అరంగేట్ర పేసర్ సకీబ్ హుస్సేన్ అవుట్ చేశాడు. ఆ తర్వాత కెప్టెన్ పరాగ్ (4)ను ప్రఫుల్ తన నాలుగో వికెట్‌గా అవుట్ చేయడంతో రాజస్థాన్ 9/5 స్కోరుతో పీకల్లోతు కష్టాల్లో పడిపోయింది. అప్పటికి మూడు ఓవర్లే ముగియడం గమనార్హం. ఈ స్థితిలో 50 రన్స్ కూడా కష్టమే అనిపించినా.. జడేజా, ఫెరీరా రైజర్స్ వికెట్ల వేటను అడ్డుకున్నారు. 12 ఓవర్లపాటు నిలకడగా ఆడిన ఈ జోడీ ఆరో వికెట్‌కు 118 రన్స్ జోడించి జట్టు పరువు కాపాడింది. ఈ క్రమంలో ఫెరీరా అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అప్పటికే గెలుపు అసాధ్యంగా కనిపించగా.. 15వ ఓవర్‌లో ఫెరీరాను సకీబ్ బౌల్డ్ చేశాడు. తర్వాతి ఓవర్‌లోనే జడేజా కూడా వెనుదిరగగా, ఆఖర్లో తుషార్ వేగంగా ఆడినా ఫలితం లేకపోయింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్ ఆటే హైలైట్. మధ్య ఓవర్లలో అతడికి క్లాసెన్ సహకరించాడు. చివర్లో నితీశ్, సలీల్ భారీషాట్లతో ఆకట్టుకుని స్కోరును 200 దాటించారు. అయితే మొదటి బంతికే ఓపెనర్ అభిషేక్‌ను పేసర్ ఆర్చర్ గోల్డెన్ డకౌట్ చేయడంతో స్టేడియంలో నిశ్శబ్దం ఆవరించింది. అటు మరో ఓపెనర్ హెడ్ (18) పెద్దగా టచ్‌లో ఉన్నట్టు కనిపించలేదు. కానీ రెండో బంతికే క్రీజులో అడుగుపెట్టిన ఇషాన్ ఎదురుదాడికి దిగాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 51/1 స్కోరుతో ఫర్వాలేదనిపించింది. ఆ వెంటనే పరాగ్ ఓవర్‌లో హెడ్ వెనుదిరగడంతో రెండో వికెట్‌కు 55 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

# హార్దిక్ పాండ్య కెప్టెన్సీ వల్లే ముంబైకి వరుస ఓటములు!



ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ పేలవ ప్రదర్శన కొనసాగిస్తోంది. జట్టు ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో కెప్టెన్ హార్దిక్ పాండ్యపై విమర్శలు ముదురుతున్నాయి. ఆడిన నాలుగు మ్యాచుల్లో మూడు ఓడి పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో కొనసాగుతోంది. దీంతో జట్టు వైఫల్యానికి హార్దిక్ పాండ్యనే కారణమంటూ సోషల్ మీడియా వేదికగా అభిమానులు విమర్శిస్తున్నారు. ఇదే అంశంపై టీమిండియా మాజీ ప్లేయర్ సదాగోపన్ రమేశ్ కూడా స్పందించాడు. ఇప్పటికైనా హార్దిక్‌ను కెప్టెన్సీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశాడు. 'ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ తీసుకున్న నిర్ణయాల వల్లే ఎంఐ ఓడిపోయింది. ముఖ్యంగా తమ అత్యుత్తమ బౌలర్ బుమ్రాను పవర్ ప్లేలో రెండు ఓవర్లు వేయించడం అతిపెద్ద తప్పిదం. ఆ తర్వాత చాలా ఓవర్ల వరకు బుమ్రా బౌలింగ్‌కే రాలేదు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రజత్ పాటీదార్ దూకుడుగా ఆడుతున్న సమయంలో స్పిన్నర్ మయాంక్ మార్కండేను బౌలింగ్‌కు పంపారు. రజత్ స్పిన్‌పై బలంగా ఆడతాడని తెలిసినా అలాంటి రిస్క్ తీసుకోవడం నాకే ఆశ్చర్యంగా అనిపించింది' అని సదాగోపన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. 'నేను, అభిమానులు మాత్రమే కాదు.. మైదానంలో హార్దిక్ తీసుకున్న కొన్ని నిర్ణయాలపై జట్టులోని సీనియర్ ప్లేయర్లు రోహిత్ శర్మ, సూర్య కుమార్ యాదవ్ కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. టిమ్ డేవిడ్‌పై తీసుకున్న రివ్యూ నిర్ణయం చూసి సూర్య షాక్ అయ్యాడు. రోహిత్ శర్మ కూడా పలు సందర్భాల్లో హార్దిక్ నిర్ణయాలతో ఏకీభవించలేదు. హార్దిక్ పాండ్య ఓ ప్లేయర్‌గా అగ్రస్థాయిలో ఉండొచ్చు. కానీ కెప్టెన్సీ పరంగా సాధారణ స్థాయిలోనే ఉన్నాడు. అతడి నిర్ణయాల్లో అయోమయం కనిపిస్తోంది. ఈ తప్పిదాలు సరిదిద్దుకోలేకపోతే ముంబై ఇండియన్స్‌కు ముమ్ముందు చాలా కఠిన పరిస్థితులు ఎదురవుతాయి' అని సదాగోపన్ రమేశ్ తెలిపాడు.




## మళ్ళీ కెమెరా ముందుకు..
# నివేదా పేతురాజ్



అన్ని రోజులూ ఒకలా ఉండవు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుందామంటే అందరికీ ఒక్కోసారి కుదరదు కూడా! ప్రస్తుతం ప్రముఖ నటి నివేదా పేతురాజ్ పరిస్థితి అలానే ఉంది. ఫిల్మ్ ఆఫర్స్ బాగానే ఉన్న సమయంలోనే నటనకు ఫుల్ స్టాప్ పెట్టి, వైవాహిక జీవితంవైపు మళ్ళాలని నివేదా పేతురాజ్ భావించింది. గత యేడాది ఆగస్ట్‌లో దుబాయ్‌కు చెందిన వ్యాపారవేత్త రాజ్‌హిత్ ఇబ్రాన్‌తో నిశ్చితార్థం జరిగినట్టు తెలిపింది. మొదట్లో తన రిలేషన్‌ను సీక్రెట్‌గా ఉంచిన నివేదా పేతురాజ్... ఇక పెళ్ళి పీటలు ఎక్కడే తరువాయి అనుకున్న సమయంలో ఈ ఎంగేజ్‌మెంట్ ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దాంతో ఆమె సహ నటీనటులు, అభిమానులు అభినందనల జల్లులో ఆమెను తడిపేశారు. అయితే ఈ వ్యవహారం అంతా పాలపొంగులా చప్పున చల్లారిపోయింది. రాజ్‌హిత్‌కు వేరొకరితో నిశ్చితార్థం జరిగిందనే వార్త బయటకు పొక్కింది. దాంతో నివేదా పేతురాజ్ అతన్ని అన్ ఫాలో చేయడమే కాకుండా... తన నిశ్చితార్థం ఫోటోలను సోషల్ మీడియా నుంచి తొలగించింది. అయితే ఇంతవరకూ నివేదా పేతురాజ్ ఈ విషయం గురించి అధికారికంగా ప్రకటించలేదు.

ఇదిలా ఉంటే... వ్యక్తిగత జీవితంలో తగిలిన ఎదురుదెబ్బలను తట్టుకుని, ముందుకు సాగాలని నివేదా పేతురాజ్ భావించిందని తెలుస్తోంది. ఇప్పట్లో మళ్ళీ ప్రేమ, పెళ్ళి అనే జంఝాటాల జోలుకు పోకుండా... కొంతకాలం నటనపై దృష్టి పెట్టాలని అనుకుంటోందట. దాంతో గతంలో తనతో సినిమాలు తీసిన దర్శక నిర్మాతలకు, తనతో నటించిన హీరోలకు టచ్‌లోకి వెళ్ళి... తనకు తగ్గ పాత్రలు ఏమైనా ఉంటే ఇవ్వమని అడుగుతోందట. నిజానికి కెరీర్ ప్రారంభం నుంచి కూడా నివేదా పేతురాజ్... కేవలం హీరోయిన్ పాత్రలు మాత్రమే చేయాలని గిరి గీసుకోలేదు. 'అల వైకుంఠపురములో...' వంటి సినిమాలో సుశాంత్ సరసన సైడ్ క్యారెక్టర్ కూడా చేసింది. అదే సమయంలో హీరోయిన్ ఓరియంటెడ్ మూవీస్ సైతం చేసింది. ఇప్పుడు మళ్ళీ నటిగా బిజీ కావడంకోసం నివేదా తనవంతు కృషి తాను చేస్తోందని సన్నిహితులు చెబుతున్నారు. ఇంతవరకూ నివేదా పరిమితమైన సినిమాల్లోనే చేసినా... నటిగా తనకంటూ ఓ గుర్తింపును తెచ్చుకుంది. ఇప్పుడు గాయపడిన వ్యక్తిగా మరింత ఫోకస్‌గా ఆమె సినిమాలు చేసే ఆస్కారం ఉంది. సో ఈ సెకండ్ ఇన్నింగ్స్‌లో నివేదా పేతురాజుకు ఎలాంటి పాత్రలు లభిస్తాయో చూడాలి

# ఎంత ఎత్తుకు ఎదిగినా.. నా ప్రపంచాన్ని చిన్నదిగా చేసుకున్నా: రామ్ చరణ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ మరోసారి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ప్రఖ్యాత 'ఎస్క్వైర్ ఇండియా' మ్యాగజైన్ లేటెస్ట్ ఎడిషన్ కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా మ్యాగజైన్, రామ్ చరణ్‌ను "ప్రస్తుత తరాన్ని ప్రభావితం చేస్తున్న గ్లోబల్ ఫోర్స్" అని, "భారతీయ సినిమాకు ఒక ముఖ్యమైన ముఖచిత్రంగా నిలిచారు" అని అభివర్ణించింది. "రామ్ చరణ్ సినీ ప్రయాణాన్ని సెలబ్రేట్ చేస్తూ, ఆయన్ను మునుపెన్నడూ చూడని సరికొత్త రూపంలో మా కవర్‌పై ఆవిష్కరిస్తున్నాం" అని ఎస్క్వైర్ ఇం డియా తన కథనంలో పేర్కొంది. ఈ ఫోటోషూట్‌ను ప్రత్యే కంగా హాంకాంగ్‌లో నిర్వహిం చినట్లు సమాచారం. ప్రస్తుతం రామ్ చరణ్, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ నుంచి స్వల్ప విరామం తీసుకుని ఆయన హాంకాంగ్‌లో జరిగిన ఈ ఫోటోషూట్‌లో పాల్గొన్నారు. విశేషమేమిటంటే, 'పెద్ది' సినిమా కోసం మెయింటైన్ చేస్తున్న హెయిర్‌స్టైల్‌తోనే ఆయన ఈ షూట్‌లో కనిపించారు. దీంతో ఆయన లుక్‌పై అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.




## శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న
# 'మారెమ్మ' సినిమా



మాస్ మహారాజా రవితేజ సోదరుడు, నటుడు రఘు తనయుడు మాధవ్ విలేజ్ యాక్షన్-డ్రామా 'మారెమ్మ'తో హీరోగా బిగ్ స్క్రీన్ పై అడుగు పెడుతున్నారు. ఈ చిత్రంతో మంచాల నాగరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మయూర్ రెడ్డి బండారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ విడుదలయ్యాయి. తాజాగా 'మారెమ్మ' నుండి ఫస్ట్ సింగిల్ 'బావ బావ' సాంగ్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. ప్రశాంత్ ఆర్ విహారి స్వరపరిచిన ఈ పాటలో పల్లెటూరి మట్టి వాసనతో పాటు మోడరన్ మ్యూజిక్ లేయర్స్ మిళితమై ఎంతో మధురమైన అనుభూతిని కలిగిస్తోంది. ప్లజెంట్ ఫీల్‌ను అందించేలా ఈ పాట సాగిన తీరు ఆకట్టుకుంటోంది. బావపై ఉన్న అప్యాయతను ఎంతో సింపుల్‌గా, హృదయానికి హత్తుకునేలా కమల్ ఎస్లవత్ సాహిత్యాన్ని అందించారు. శ్రుతి రంజని తన స్వరంలో ఉన్న నేచురల్, రస్టిక్ టచ్‌తో ఈ పాటకు ప్రాణం పోశారు. మాధవ్, దీపా బాలు మధ్య కనిపించే సహజమైన కెమిస్ట్రీ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. వారి యాక్టింగ్‌లో ఉన్న సహజత్వం, పల్లెటూరి అందమైన లోకేషన్స్ కలిసి విజువల్స్ ట్రీట్‌గా మార్చాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ ప్రశాంత్ అంకిరెడ్డి అందించగా, ఎడిటర్‌గా దేవ్ రాథోడ్, ఆర్ట్ డైరెక్టర్‌గా రాజ్‌కుమార్ మురుగేసన్ పని చేస్తున్నారు. ఈ సినిమా విడుదల తేదీ త్వరలో అనౌన్స్ చేయనున్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**